# ప్రజా తపన

prajathapana.com

News that matters




సుఖమయం, శుభదాయకం, అయిన లోకం సామాజిక ప్రగతి, వేడి మంచు, నల్లని వెలుగుల్లా అసంబద్ధమైనవే. అనర్థాలను సృష్టించని భౌతిక అభివృద్ధి ఉండదు.

- స్వామి వివేకానంద


సంపుటి :01 సంచిక: 24 శనివారం 04 మార్చి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# విశాఖే పరిపాలనా రాజధాని...

## గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ముఖ్యమంత్రి జగన్ కీలక ప్రకటన

**విశాఖపట్టణం :**

సాగర నగరం విశాఖ కేంద్రంగా జరుగుతున్న గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. విశాఖే పరిపాలనా రాజధాని అని, త్వరలో విశాఖ నుంచి పరిపాలన కొనసాగిస్తానని జగన్ మరోమారు వ్యాఖ్యానించారు. రాజధాని కేసు సుప్రీంకోర్టు విచారణలో ఉండగానే మరోసారి ఏపీ రాజధానికి సంబంధించి సీఎం జగన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేయడం గమనార్హం.జగన్ పోకడను పరిశీలిస్తే.. ఆయనకు రాజ్యాంగ వ్యవస్థలపై ఏమాత్రం గౌరవం లేదని అర్థమవుతోందని ప్రతిపక్ష టీడీపీ నేతలు విమర్శించారు. ఈ తరహా వ్యాఖ్యలు ఏపీ ముఖ్యమంత్రి జగన్ చేయడం ఇది రెండోసారి. “రానున్న రోజుల్లో రాష్ట్ర రాజధాని కానున్న విశాఖకు మిమ్మల్ని ఆహ్వానిస్తున్నాను. మరికొద్దినెలల్లో నేను కూడా విశాఖకు మకాం మార్చబోతున్నాను. ఈ ఏడాది మార్చి 3-4 తేదీల్లో విశాఖలో జరిగే ఇన్వెస్టర్ల సమ్మిట్‌కు రావాల్సిందిగా ఆహ్వానిస్తున్నాను. మీరు రావడమే కాకుండా మా రాష్ట్రంలో వ్యాపారం చేయడం ఎంత సులభమో విదేశాల్లో ఉన్న మీ సహచరులకు కూడా చెప్పి.. తీసుకురండి” అని ఢిల్లీలో జరిగిన ఏపీ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ సన్నాహక సమావేశంలో కూడా జగన్ ప్రకటించిన సంగతి తెలిసిందే.ఇదిలా ఉండగా.. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి సంబంధించిన కేసుల విషయంలో జగన్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో షాక్ తగిలిన 24 గంటల వ్యవధిలోనే ఏపీ సీఎం జగన్ రాజధానిపై ప్రకటన చేయడం విమర్శలకు తావిచ్చింది. రాష్ట్ర రాజధానిగా అమరావతినే కొనసాగించాలంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై త్వరగా విచారణ పూర్తి చేయాలన్న రాష్ట్ర ప్రభుత్వం తరఫు న్యాయవాదుల అభ్యర్థనను న్యాయస్థానం తిరస్కరించింది.గతంలో చెప్పినట్లుగాఈ నెల 28వ తేదీనే విచారిస్తామని జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ అహసనుద్దీన్ అమానుల్లాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ కేసు చాలా పెద్దదని.. రాజ్యాంగపరమైన అంశాలు చాలా ఇమిడి ఉన్నాయని జస్టిస్ జోసెఫ్ తెలిపారు. దీనిపై విచారణ చేపడితే.. ఒక సార్థకత అంటూ ఉండాలని వ్యాఖ్యానించారు. 28న విచారణంటే ఆలస్యమవుతుందని రాష్ట్రప్రభుత్వం తరఫు సీనియర్ న్యాయవాది నిరంజన్‌రెడ్డి మళ్లీ పేర్కొన్నారు. అయితే 28వ తేదీనే విచారిస్తామని



ధర్మాసనం స్పష్టం చేయడంతో.. అందుకు ఆ ఒక్క రోజే సరిపోదని, 29, 30 తేదీల్లో (బుధ, గురువారాలు) కూడా విచారణ జరపాలని ఏపీ ప్రభుత్వ న్యాయవాదులు కోరారు.నోటీసులు ఇచ్చిన కేసుల్లో బుధ, గురువారాల్లో విచారణ జరుపరాదని ప్రధాన న్యాయమూర్తి సర్క్యులర్ ఇచ్చారని ధర్మాసనం గుర్తు చేసింది, దీనిపై ప్రధాన న్యాయమూర్తి ముందు ప్రత్యేకంగా ప్రస్తావించడానికి అనుమతివ్వాలని న్యాయవాదులు కోరారు. ఇందుకు తన అనుమతి అవసరం లేదని జస్టిస్ జోసెఫ్ స్పష్టం చేశారు. ‘మీ ఇష్టం.. మీరు

(మిగతా 2లో)



## హిజాబ్ పిటిషన్ పై విచారణను తిరస్కరించిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ :**

కర్ణాటక లోని ప్రభుత్వ విద్యా సంస్థల్లో పరీక్షలకు హిజాబ్ ధరించి హాజరయ్యేందుకు అవకాశం ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై అత్యవసర విచారణ జరిపేందుకు సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఈ పిటిషన్లపై విచారణ జరిపేందుకు ప్రత్యేక ధర్మాసనాన్ని హోలీ సెలవుల తర్వాత ఏర్పాటు చేస్తామని చెప్పింది.ముస్లిం విద్యార్థినులు హిజాబ్ ధరించి పరీక్షలకు హాజరయ్యేందుకు అనుమతించాలని కర్ణాటకలోని విద్యా సంస్థలకు ఆదేశాలివ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్లపై అత్యవసర విచారణ

(మిగతా 2లో)

## మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం 10న దీక్ష

**హైదరాబాద్ :**



మార్చి 10న ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద దీక్ష చేయబోతున్నట్టు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రకటించారు. భారత్ జాగృతి ఆధ్వర్యంలో ఈ ఒక్క రోజు దీక్ష చేస్తామన్నారు. పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్ ప్రవేశ పెట్టాలన్న డిమాండ్‌తో ఈ దీక్ష చేయబోతున్నట్టు తెలిపారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే దీన్ని ప్రవేశ పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. 29 రాష్ట్రాల్లో ఉన్న మహిళా సంఘాల నాయకులు, రాజకీయా పార్టీలకు చెందిన

(మిగతా 2లో)


## హోళి గీత దాటితే వేటు

**లక్నో :**



హోళి పండుగ సమీపిస్తున్న తరుణంలో యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. అన్ని సంప్రదాయాలు, ఆచారాలను గౌరవిస్తామని, కానీ గీత దాటితే మాత్రం ఊరుకోమని వార్నింగ్ ఇచ్చారు. హోళి వేడుకల పేరు చెప్పి అకృత్యాలకు పాల్పడొద్దంటూ హెచ్చరించారు.

(మిగతా 2లో)




## ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు

**విజయవాడ**

దేశవిదేశాల నుంచి ప్రకృతి అందాలతో అలరారే విశాఖ నగరానికి వస్తున్న పెట్టుబడిదారులందరికీ జనసేన స్వాగతం పలుకుతోంది. మా శక్తివంతమైన, అనుభవం కలిగిన ఆంధ్రప్రదేశ్ యువత మిమ్మల్ని మెప్పిస్తారని భావిస్తున్నాను. ఈ గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి మంచి భవిష్యత్తు. మన యువతకు ఉపాధిని అందించే అవకాశం కల్పించడంతోపాటు ఇన్వెస్టర్లు కూడా తమ పెట్టుబడులకు తగిన ప్రతిఫలం పొందుతారని ఆశిస్తున్నాను’ అని పవన్ ట్వీట్ చేశారు.

హృదయపూర్వక విన్నపం..!

‘ ఏపీలో ఆర్థికవృద్ధికి ఉన్న అవకాశాలు, శక్తివంతమైన మానవ వనరులు, ఖనిజ సంపద, సముద్రతీరం వంటి వాటిని ఇన్వెస్టర్లకు సవివరంగా

(మిగతా 2లో)

## ఆరోగ్యరంగంలోకి రిలయన్స్ అంబానీ

**ముంబై :**

రిలయన్స్ ఇండస్ట్రీస్ అధినేత, ప్రపంచ కుబేరుడు ముకేష్ అంబానీ మరో సంచలనానికి సిద్ధం అవుతున్నారు. గతంలో, జియోను తీసుకువచ్చి, టెలికాం రంగంలో ఆకాశంలో ఉన్న రేట్లను నేల మీదికి దించిన అంబానీ... ఇప్పుడు అలాంటి మరో ఫీట్‌కు సిద్ధం అవుతున్నారు. ఆయిల్, రిటైల్, టెలికాం రంగాల్లో అగ్రస్థానంలో ఉన్న రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇప్పుడు మరో కొత్త వ్యాపార విభాగంలోకి కూడా అడుగు పెట్టబోతోంది. అదే, హెల్త్ కేర్ సెగ్మెంట్. ఆ విభాగంలోనూ నంబర్ వన్‌గా నిలిచేందుకు, ప్రపంచంలోనే అత్యంత తక్కువ ధరకు జెనెటిక్ మ్యాపింగ్ (జన్యు పరీక్షలు) సర్వీసును అందించాలని తాపత్రయ పడుతోంది. ఆరోగ్య సంరక్షణ విషయంలో భారతదేశ వినియోగదార్ల మార్కెట్ విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో, అమెరికాలోని 23అండ్‌మీ అంకుర సంస్థ తరహాలో అత్యంత తక్కువ ధరకే భారతీయులకు జన్యు పరీక్షలను అందుబాటులోకి తీసుకురావాలని అనుకుంటోంది. తద్వారా, ఆరోగ్య సంరక్షణను మరింత సరసమైన ధరల్లోకి, సమగ్రంగా మార్చాలని రిలయన్స్ ఇండస్ట్రీస్ చూస్తోంది.రిలయన్స్ గ్రూప్ మరికొన్ని వారాల్లో సమగ్ర రూ. 12,000 (145 డాలర్లు) ధరకే జీనోమ్ టెస్టింగ్‌ను పరిచయం చేస్తుందని స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ అఖా రమేష్ హరిహరన్ చెప్పినట్లు బ్లూంబెర్గ్ రిపోర్ట్ చేసింది. 2021లో, స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ వాటాను కొనుగోలు చేసింది, ఆ సంస్థలో ఇప్పుడు రిలయన్స్‌కు 80 శాతం వాటా ఉంది.రిలయన్స్ గ్రూప్. అమెరికాలోని 23అండ్‌మీ స్టార్టప్ కంపెనీ తరహాలో అత్యంత తక్కువకే భారతీయులందరికీ ఈ జీనోమ్ టెస్టింగ్ అందుబాటులోకి తీసుకురావాలని రిలయన్స్ భావిస్తోంది. భారతదేశంలో బిజినెస్ చేస్తున్న మ్యాప్‌మైజీనోమ్, మెడ్‌జీనోమ్ వంటి కంపెనీలు సంపూర్ణ జీనోమ్ సీక్వెన్సింగ్ కోసం ప్రస్తుతం 1,000 డాలర్లకు పైగా వసూలు చేస్తున్నాయి. వాటితో పోలిస్తే, తాము అందించే జీనోమ్ సీక్వెన్సింగ్ టెస్టింగ్ కిట్ ధర 86 శాతం చౌక అని స్ట్రాండ్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ తెలిపింది. క్యాన్సర్, గుండె, న్యూరో డిజెనరేటివ్ వ్యాధులతో పాటు వంశపారంపర్యంగా వచ్చే జన్యుపరమైన వ్యాధులను గుర్తించేందుకు జీనోమ్ మ్యాపింగ్ పరీక్షలు ఉపయోగపడతాయి.

మై జియో యాప్ ద్వారా జీనోమ్ మ్యాపింగ్ టెస్ట్ కిట్స్‌ను మార్కెటింగ్ చేయాలని రియలన్స్ ఇండస్ట్రీస్ భావిస్తోంది. బిలియన్ల ప్రజలకు పెద్ద ఉపశమనంఈ

(మిగతా 2లో)

# విశాఖే పరిపాలనా రాజధాని...

(మొదటిపేజీ తరువాయి)

సీజేఐ ముందు ప్రస్తావించాలనుకుంటే ప్రస్తావించవచ్చు. అయితే నేను జూన్‌లో రిటైరవుతున్నాను. ఆ విషయం కూడా ప్రధాన న్యాయమూర్తికి చెప్పండి. రిటైరయ్యేలోపు ఈ కేసు విచారణ పూర్తి కావాలని కోరుకుంటున్నాను' అని జస్టిస్ జోసెఫ్ వ్యాఖ్యానించారు. దీంతో బుధ, గురువారాల్లో (29, 30ల్లో) కూడా అమరావతి కేసుపై విచారణ జరిపేందుకు అనుమతి ఇవ్వాలని ఏపీ న్యాయవాదులు చీఫ్ జస్టిస్ చంద్రచూడ్‌ను కోరే అవకాశాలున్నాయి.

# హిజాబ్ పిటిషన్ పై విచారణను తిరస్కరించిన సుప్రీంకోర్టు

(మొదటిపేజీ తరువాయి)

జరిపేందుకు భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధనంజయ వై చంద్రచూడ్ తిరస్కరించారు. హోళీ పండుగ సెలవుల తర్వాత ఈ అంశంపై విచారణ జరిపేందుకు ప్రత్యేక ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తామని చెప్పారు. సెలవులు ముగిసిన వెంటనే ఈ పిటిషన్లను విచారణాంశాల జాబితాలో చేర్చుతానని చెప్పారు.మార్చి 8న హోళీ పండుగ కాగా, సుప్రీంకోర్టుకు మార్చి 6 నుంచి 12 వరకు సెలవులు. తిరిగి సర్వోన్నత న్యాయస్థానం కార్యకలాపాలు మార్చి 13న ప్రారంభమవుతాయి. కర్ణాటకలో పరీక్షలు మార్చి 9 నుంచి ప్రారంభమవుతాయి.పిటిషనర్ల తరపున వాదనలు వినిపించిన న్యాయవాది మాట్లాడుతూ, మార్చి 9 నుంచి పరీక్షలు ప్రారంభమవుతాయని, అత్యవసరంగా విచారణ జరపాలని కోరారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ, "మీరు చివరి రోజున వస్తే నేనేం చేయగలను?" అని ప్రశ్నించారు. పిటిషనర్ల తరపున వాదిస్తున్న ఇతర న్యాయవాదులు మాట్లాడుతూ, గడచిన రెండు నెలల్లో రెండుసార్లు తాము విజ్ఞప్తి చేశామన్నారు.సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ, "నేను ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తాను. ఈ అంశాన్ని లిస్ట్ చేస్తాను" అన్నారు.న్యాయవాది మాట్లాడుతూ, "పరీక్షల సంగతి ఏమిటి" అన్నారు.సీజేఐ స్పందిస్తూ, "మీ ప్రశ్నలకు నేను సమాధానం చెప్పలేను" అన్నారు.కర్ణాటక ప్రభుత్వం ప్రభుత్వ విద్యా సంస్థల్లో హిజాబ్ ధరించడంపై నిషేధం విధించిందని, దీనివల్ల హిజాబ్ ధరించి పరీక్షలకు హాజరయ్యేందుకు విద్యార్థినులను అనుమతించబోరని, వెంటనే తమ పిటిషన్లపై విచారణ జరపాలని సుప్రీంకోర్టును పిటిషనర్లు కోరుతున్నారు.2022 అక్టోబరులో ఇద్దరు న్యాయమూర్తులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఇచ్చిన తీర్పులో ఓ న్యాయమూర్తి ప్రభుత్వ ఆదేశాలను సమర్థించగా, హిజాబ్ అనేది వ్యక్తిగత ఎంపిక అని, ఎంపిక చేసుకునే అవకాశాన్ని అణచివేయరాదని మరొక న్యాయమూర్తి చెప్పారు. దీంతో త్రిసభ్య ధర్మాసనాన్ని ఏర్పాటు చేస్తానని సీజేఐ గతంలో చెప్పారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం 10న దీక్ష

(మొదటిపేజీ తరువాయి)

మహిళా నాయకుల ఈ దీక్షలు మద్దతు తెలపనున్నారని కవిత వెల్లడించారు. తన నివాసంలో మీడియాతో మాట్లాడిన ఆమె... 1992లో చేసిన 72వ రాజ్యాంగ సవరణ స్థానిక సంస్థల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. తర్వాత సంవత్సరం చేసిన 73వ రాజ్యాంగ సవరణతో పట్టణ ప్రాంత స్థానిక సంస్థల్లో కూడా ఆ రిజర్వేషన్ వర్తించేలా చేశారని తెలిపారు. ఇప్పుడు పార్లమెంట్, అసెంబ్లీలో కూడా 33 శాతం ఇచ్చేలా చట్టం తీసుకురావాలన్నారు. గత 27 ఏళ్ల నుంచి ఇది పెండింగ్‌లో ఉందని గుర్తు చేశారు. 1996లో చట్టానికి ప్రయత్నాలు జరిగినా ఇప్పటి వరకు రిజర్వేషన్ కలగానే మిగిలిపోయిందన్నారు. 1952 నాటి మొదటి లోక్‌సభలో 24మంది మహిళా ఎంపీలు ఉన్నారని... స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అయిన తర్వాత ఇప్పుడు చూస్తే.. 78 మంది మాత్రమే ఎంపీలుగా ఉన్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇది ఏమాత్రం సరిపడా నెంబర్ కాదన్నారు.
2014, 2019లో ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన హామీల్లో చాలా వాటిని అమలు చేయలేదన్నారు కవిత. పార్లమెంట్‌లో ఎప్పుడు మహిళా రిజర్వేషన్ బిల్లు పెట్టినా మద్దతు ఇస్తామని కేసీఆర్ నాయకత్వంలో తాము అసెంబ్లీలో తీర్మానం ప్రవేశ పెట్టిన సంగతిని గుర్తు చేశారు కవిత. కేంద్ర దర్యాప్తు సంస్థల తీరుపై భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్సీ కవిత విమర్శలు గుప్పించారు. ఇటీవల తెలంగాణ బీజేపీ నేతలు కొంత మంది .. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం సిసోడియాను అరెస్ట్ చేసినట్లుగానే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్ట్ చేస్తారని ప్రకటిస్తారని.. బీజేపీ నేతలు చెప్పినంతనే దర్యాప్తు సంస్థలు అరెస్ట్ చేస్తాయా అని ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థలు పూర్తిగా విపక్ష నేతలనే టార్గెట్ చేశాయన్నారు. భారీ స్కాంకు పాల్పడిన అదానీ విషయంలో సీబీఐ, ఈడీ ఎందుకు దర్యాప్తు చేయడం లేదని కవిత ప్రశ్నించారు. సుప్రీంకోర్టు ఆదేశాల కారణంగానే సెబీతో పాటు .. ఓ కమిటీ విచారణకు ఏర్పాటయిందన్నారు. ప్రధానమంత్రి మోదీ వైఫల్యాలపై నిలదీస్తే దర్యాప్తు ఏజెన్సీలతో భయపెడుతున్నారని మండిపడ్డారు. తనను అరెస్ట్ చేస్తారని బీజేపీ నేతలు ప్రకటిస్తున్నారని.. అలా చేస్తారా లేదా అన్నది దర్యాప్తు సంస్థలే చెప్పాలన్నారు. ఒక వేళ బీజేపీ నేతలే అన్నీ చెబితే ఇక దర్యాప్తు ఏజెన్సీలు ఎందుకని కవిత ప్రశ్నించారు.

# ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు

వివరించండి. రివర్స్ టెండరింగ్, మధ్యవర్తుల కమీషన్లు వంటి అడ్డంకులు ఏవీ లేకుండా పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని కలిగించండి!. ఈ సమ్మిట్ ఆలోచనలను కేవలం వైజాగ్‌కే పరిమితం చేయకండి. తిరుపతి, అమరావతి, అనంతపురం, కాకినాడ, శ్రీకాకుళం, ఒంగోలు, నెల్లూరు, కడప.. ఆంధ్రప్రదేశ్ లోని ఇతర ప్రాంతాలలో ఉన్న అభివృద్ధి అవకాశాలను కూడా ఇన్వెస్టర్లకు వివరించండి. దీన్ని కేవలం ఒక నగరానికే పరిమితం చేయకుండా ఏపీ మొత్తానికి నిజమైన ఇన్వెస్టర్ల సమ్మిట్ లాగా మార్చండి' అని పవన్ విన్నవించారు.
చివరిగా.. రానున్న రెండు రోజుల్లో ప్రభుత్వంపై జనసేన ఎలాంటి విమర్శలకు చోటివ్వదని.. ఇన్వెస్టర్ల సమ్మిట్ విషయంలో ప్రభుత్వం ఎటువంటి రాజకీయ విమర్శలు చేయమని స్పష్టం చేశారు పవన్. పెట్టుబడుల ఆకర్షణ అంశంలో ప్రభుత్వానికి జనసేన సంపూర్ణ మద్దతును అందిస్తోందన్నారు రాజకీయం కంటే

# ఆరోగ్యరంగంలోకి రిలయన్స్ అంబానీ

(మొదటిపేజీ తరువాయి)

ప్రాజెక్టు అమల్లోకి వస్తే... భారతదేశంలోని 1.4 బిలియన్ల ప్రజలకు సరసమైన ధరలకు వ్యక్తిగత జెన్-మ్యాపింగ్ అవకాశాన్ని అందిస్తుంది. 145 డాలర్ల ధరతో, ప్రపంచంలోనే అత్యంత చౌకైన జీనోమిక్ ప్రొఫైల్ తమదే అని కంపెనీ వెల్లడించింది. ఇది దూకుడైన నిర్ణయమని అభిప్రాయపడ్డారు. ఇదే విధంగా 2006లో రిటైల్ రంగంలోకి, 2016లో టెలికాం రంగంలోకి ఎంట్రీ ఇచ్చిన ముఖేష్ అంబానీ, ధరలను చుక్కల నుంచి నేల మీదకు దించారు. మార్కెట్ లీడర్‌గా ఆవిర్భవించేంత వరకు ఆయా రేట్లను కంపెనీ పెంచలేదు.అలైడ్ మార్కెట్ రీసెర్చ్ నివేదిక ప్రకారం... గ్లోబల్ జెనెటిక్ టెస్టింగ్ మార్కెట్ విలువ 2019లో వి12.7 బిలియన్లుగా ఉంది, 2027 నాటికి వి21.3 బిలియన్లకు చేరుకుంటుందని అంచనా

# హోళి గీత దాటితే వేటు

(మొదటిపేజీ తరువాయి)

హోళికోత్సవ్‌తో పాటు షబ్ ఏ బరత్, రంజాన్,నవ్‌రోజ్, చైత్ర నవరాత్రి, రామనవమి తదితర పండుగలను ప్రజలంతా కలిసి ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. మరి కొద్ది రోజుల్లోనే ఈ పండుగలు రానున్నాయని, ఈ వేడుకలపై అధికారులు నిఘా పెట్టాలని ఆదేశించారు. ఇప్పటికే అన్ని జిల్లాల యంత్రాంగాలకు తప్పనిసరిగా ప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించేలా చూడాలని తేల్చి చెప్పారు. ఆన్‌లైన్ మీటింగ్‌లో వాళ్లందరితోనూ మాట్లాడారు. శాంతి భద్రతల ఉల్లంఘన జరగకుండా చూడాలని తెలిపారు. "మరి కొద్ది రోజుల్లో పండుగలు రానున్నాయి. చాలా చోట్ల ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయి. ఇలాంటి సమయంలో శాంతి భద్రతలను కాపాడుకోవాలి. మనం కచ్చితంగా నిఘా పెట్టాలి. ఆరేళ్లుగా అన్ని మతాల వారి కార్యక్రమాలు, పండుగలు చాలా ప్రశాంతంగా జరుగుతున్నాయి. భవిష్యత్‌లోనూ ఇదే తీరు కొనసాగాలి. ప్రజలకు అవసరమైన అన్ని సౌకర్యాలనూ అధికారులు కల్పించాలి. ప్రతి మతాన్ని, ఆచారాన్నీ గౌరవించాలి. కానీ...నియంతృత్వంగా వ్యవహరిస్తామంటే మాత్రం కుదరదు. ఆర్గనైజర్లు అందరూ కచ్చితంగా ప్రశాంతంగా వేడుకలు జరుపుతామని ప్రభుత్వానికి హామీ ఇచ్చాకే అనుమతులు వస్తాయి"ఇదే సమయంలో వేడుకల్లో పెట్టే పాటలపైనా ఆంక్షలు విధించారు యోగి ఆదిత్యనాథ్. ఇలాంటి వేడుకల్లో పిచ్చిపిచ్చి పాటలు పెట్టడానికి వీల్లేదని తేల్చి చెప్పారు. అసభ్యకరమైన పదాలున్న పాటలు పెట్టొద్దని ఆదేశించారు. అదే సమయంలో స్పీచ్‌ల్లోనూ ఎక్కడా ఏ వర్గాన్నీ కించపరిచే విధంగా స్టేట్‌మెంట్‌లు ఇవ్వకూడదని వెల్లడించారు. ప్రజల్ని రెచ్చగొట్టే విధంగా నిర్వాహకులు వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని చెప్పారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ రికార్డు సృష్టించారు. యూపీకి ఎక్కువ కాలం పాటు సీఎంగా ఉన్న నేతగా రికార్డుకెక్కారు. 5 సంవత్సరాలుగా రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న యోగి...గత ముఖ్యమంత్రుల కన్నా ఎక్కువ కాలం పాటు ఆ పదవిలో కొనసాగుతున్నారు. 5 సంవత్సరాల 347 రోజులుగా సీఎం కుర్చీలో ఉన్నారు. అంతకు ముందు కాంగ్రెస్ హయాంలో ఈ డా. సంపూర్ణానంద్ యూపీకి 5 సంవత్సరాల 345 రోజుల పాటు సీఎంగా ఉన్నారు. 1954డిసెంబర్ 18 నుంచి 1960 డిసెంబర్ 6వ తేదీ వరకూ సీఎంగా బాధ్యతలు చేపట్టారు. ఆ తరవాత ఎక్కువ కాలం పాటు ఈ పదవిలో కొనసాగిన వారిలో సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్ కూడా ఉన్నారు. 5 సంవత్సరాల 4 రోజుల పాటు కొనసాగారు. తరవాత బీఎస్‌పీ చీఫ్ మాయావతి 4 సంవత్సరాల 307 రోజుల పాటు ముఖ్యమంత్రిగా పని చేశారు. మొత్తం నాలుగు సార్లు ఆమె సీఎం అయ్యారు. ములాయం సింగ్ యాదవ్ 3 సంవత్సరాల 257 రోజుల పాటు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. యోగి ఆదిత్యనాథ్ రెండు సార్లు ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. అంతే కాదు. గతేడాది జరిగిన ఎన్నికల్లో బీజేపీకి భారీ మెజార్టీకి రావడానికి కారణమూ ఆయనే.

# సోమశిల జలాశయం ముంపు గ్రామాల నిరుద్యోగులకు త్వరలో ప్రభుత్వ ఉద్యోగాలు

**1335 మందికి మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాలు**

**స్పష్టం చేస్తున్న సోమశిల జలాశయం ఉన్నతాధికారులు**

**నిరుద్యోగుల్లో చిగురించిన ఆశలు**

**బద్వేలు**



సోమేశుల జలాశయం నిర్మాణంలో ముంపుకు గురైన గ్రామాలలో నిరుద్యోగ అభ్యర్థుల ఉద్యోగాలు ఇచ్చే విషయంపై దాదాపు ఒక కొలిక్కి వచ్చింది ప్రభుత్వ ఉత్తర్వులు రాష్ట్ర ఉన్నత అధికారులు జారీ చేసిన మార్గదర్శకాలు అనుసరించి చేపట్టిన కసరత్తు తుది దశకు చేరుకుంది వారం పది రోజుల్లో తుది జాబితాను ఉన్నత అధికారులకు నివేదించాలని ఇంజనీరింగ్ అధికారులు ఒక నిర్ణయానికి వచ్చారు దరఖాస్తుదారుల్లో చాలా తక్కువ మందికి ఉద్యోగ అర్హత ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు ఉమ్మడి కడప జిల్లాలో బద్వేలు నియోజకవర్గానికి సంబంధించి అట్లూరు గోపవరం రాజంపేట నియోజకవర్గానికి సంబంధించి నందలూరు ఒంటిమిట్ట సిద్ధవటం పెనగలూరు మండలాల్లో 105 గ్రామాలు పూర్తిగా 9 గ్రామాలు పాక్షికంగా ముంపుకు గురయ్యాయి ఈ జలాశయం నిర్మాణానికి 1975 జూన్ 6వ తేదీ శంకుస్థాపన చేయగా 1988 నవంబర్లో జాతికి అంకితం చేశారు ప్రాజెక్ట్ నిర్మాణంలో భూములు స్థలాలు ఇల్లు ఇతర కట్టడాలు నష్టపోయిన వారికి పరిహారం చెల్లించారు పునరావాస ప్యాకేజీని వర్తింప చేయలేదు ప్రభుత్వ నిబంధనలు అనుసరించి ఆయా కుటుంబాల్లో ఉన్న సభ్యులకు విద్యా అర్హత ఉంటే ఇంటికో ఉద్యోగం ఇస్తామని అప్పటి పాలకులు ప్రకటించారు ఈ మేరకు 1986 ఏప్రిల్ 15వ తేదీ అప్పటి ప్రభుత్వం ఉత్తరువు 98 జారీ చేసింది ఆ తరువాత అర్హతలపై 2013 ఆగస్టు 22 తేదీ మరో ఉత్తరువు ఇచ్చారు ఇప్పటివరకు 321 మందికి ఉద్యోగాలు ఇవ్వడం జరిగింది సరైన అవగాహన లేక చాలామంది దరఖాస్తులు చేసుకోలేదు ప్రభుత్వానికి తమ బాధ చెప్పుకోవడంతో మరోసారి అవకాశం ఇచ్చారు 2014 తరువాత దాదాపు 5000 మంది దరఖాస్తు చేసుకున్నారు ఉద్యోగాలు ఇవ్వడంలో అన్యాయం జరుగుతుందని నాలుగు సంవత్సరాల కింద కొంతమంది నిరుద్యోగులు కోర్టుకు వెళ్లారు మార్పులు చేర్పులు సవరణలు చేసుకోవాలని 2021జూన్లో అధికారులు మరో అవకాశం ఇచ్చారు జాబితాలో చోటు చేసుకున్న తప్పులు పొరపాట్లను సరిదిద్దారు అర్హుల జాబితాలో వెనుక ఉన్న పేర్లను ముందుకు తీసుకురావాలని రాష్ట్ర సర్వోన్నత న్యాయ స్థానం 2022 జూలై 7వ తేదీ తీర్పు ఇచ్చింది మొత్తం9751 మంది దరఖాస్తులు అధికారుల పరిశీలనలో ఉన్నాయి హైకోర్టు తీర్పు నేపథ్యంలో ఎంపిక ప్రక్రియ ఎలా చేపట్టాలో మార్గదర్శకాలు ఇవ్వాలని సోమేశిల జలాశయం ఎస్సీ కార్యాలయం ఇంజనీరింగ్ అధికారులు రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదించారుదీనిపై ప్రభుత్వ ఉత్తర్వు 98 ప్రకారం 2013 లో ఇచ్చిన మెమోను అనుసరించాలని గత నెల 13 తేది ఉత్తర్వులు ఇచ్చారు ఈ నేపథ్యంలో అవార్డు పరిహారం చెల్లింపు గ్రామంలోకి చేరిన వెనుక జలాలు సొంత ఊరు నుంచి ఎప్పుడు ఖాళీ చేశారు దరఖాస్తు ఎప్పుడు ఇచ్చారు విద్యా అర్హతలు ఏమిటి అనే విషయాలపై గత 20 రోజులుగా పరిశీలన చేస్తున్నారు ఇందుకు సంబంధించిన కసరత్తు దాదాపు పూర్తయింది జాబితాపై అధికారులు ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం 1335 మందికి మాత్రమే ఉద్యోగ అర్హత ఉందని నిర్ధారించారు కొలువు వస్తుందో లేదు తెలియక నిరుద్యోగులు ఉత్కంఠతో ఉన్నారు మరోవైపు కొంతమంది దళారులు రంగంలోకి దిగి మా వాళ్ళకి ఉద్యోగం ఇవ్వాలని అధికారులపై ఒత్తిడి పెంచుతున్నట్లు సమాచారం ఈ మేరకు పైరవీలు కూడా చేస్తున్నారు తుది జాబితాను మరో వారం రోజుల్లో ఉన్నత అధికారులకు పంపుతామని సోమేశిల సీనియర్ అధికారి ఒకరు ధ్రువీకరించారు

# అదాని ,అంబానీలకు దోచి పెడుతున్న ప్రధాని

# మోడీపెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలి

**జగిత్యాల:**

కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని మోడీ ఆదాని , అంబానీలకు దోచిపెడుతూ పేదల నడ్డి విరుస్తున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్. సంజయ్ కుమార్, జడ్పీచైర్పర్సన్ దావ వసంత -సురేష్ లు ఆన్నారు.. కేంద్ర ప్రభుత్వ సామాన్యుల నడ్డి విరిచే విధంగా పెంచిన గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలో తహసీల్ చౌరస్తా వద్ద కట్టెల పొయ్యిపై వంట చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఆర్డీవో కార్యాలయంలో ఏవో రాజమనోహర్ కి వినతిపత్రం అందజేశారు మెమొరాండం అందజేశారు..ఈ సందర్భంగా ఎమ్మెల్యే,జడ్పీచైర్పర్సన్ మాట్లాడుతూ రూ. 400 ఉన్న సిలిండర్ ధరను మూడింతలుగా పెంచిన ఘనత బిజెపి పార్టీ దేనన్నారు. దేశ ప్రజల దోచుకుని ఆదాని, అంబానీ కుటుంబాలకు దోచి పెడుతుందని ఆరోపించారు.. 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు నుండి బిజెపి ప్రభుత్వం పెట్రోల్ ,డీజిల్ ,గ్యాస్ ధరలను నిరంతరం పెంచుతూ పోతున్నదని , దీనికి అంతర్జాతీయంగా చమురు బ్యారెల్ ధరలు పెరుగుతున్నాయని సాకు చెబుతున్నదన్నారు.. అంతర్జాతీయ మార్కెట్ లో చమురు బ్యారేజ్ ధరలు తగ్గినప్పుడు మన దేశంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు ఎందుకు తగ్గడం లేదన్నారు. పేద, మధ్యతరగతి మహిళ ఉసురు బీజేపీ ప్రభుత్వానికి తప్పకుండా తగులుతుందని అన్నారు. పెంచిన గ్యాస్ సిలిండర్ల ధరను వెంటనే తగ్గించాలని బిజెపి పార్టీకి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు.మోడీ అసమర్ధ పాలన, అనాలోచిత నిర్ణయాల వల్లనే దేశంలో రూపాయి విలువ తగ్గిందన్నారు.తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు కళ్యాణ లక్ష్మి ,బీడీ,ఒంటరి మహిళ,తదితర పెన్సన్ లు ఇస్తుంటే దేశంలో మోడీ సర్కార్ గ్యాస్ ధర పెంచి కట్టెల పొయ్యి సంస్కృతికి శ్రీకారం చుడుతున్నారని అన్నారు.కాంగ్రెస్,బీజేపీ లవి చీకటి ఒప్పందం అని,కేంద్రం గ్యాస్ ధర పెంచితే రాష్ట్రం భరించాలి అనడం అవివేకం అని,బీజేపీ తెలంగాణ కి ఎం చేసింది అనేది చెప్పాలని,నిధులు మంజూరు పై స్థానిక ఎంపి నీ ప్రశ్నించాలని జీవన్ రెడ్డి ని ఉద్దేశించి అన్నారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం అని అన్నారు.బీడీ లు,పాలు,నూలు వస్త్రాలు ల పై జీఎస్టీ పెంచడం ఆయా రంగాల్లో శ్రామికులు తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు.ఆనంతరంజడ్పీ చైర్మన్ మాట్లాడుతూమోదీ అధికారం లోకి వచ్చిన తర్వాత 13 సార్లు గ్యాస్ సిలిండర్ ధరను పెరిగాయి అన్నారు.గతంలో 400 రూపాయలు ఉంటే నేడు 1,155 రూపాయలకు చేరించిదన్నారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజల సంక్షేమ కోసం పాటుపడుతుంటే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు కొమ్ముకాస్తూ నిత్యవసర ధరలు గ్యాస్ ధరలు పెంచి ప్రజల నడ్డివిరుస్తుందన్నారు. మోడీ ప్రభుత్వం వచ్చాక నిత్యవసర వస్తువులు ధరలు ఆకాశాన్ని అంటాయని, కేంద్ర ప్రభుత్వం అధాని లాంటి కార్పొరేట్ కంపెనీలకు కొమ్ము కాస్తూ, ఇతర కంపెనీ దివాలా తీస్తే వాటి భారాన్ని ప్రజలపై వేసి ప్రజలు నడ్డి విరిచే విధంగా వివరిస్తుందన్నారు .ఆడబిడ్డల ఉసురు బీజేపీ నాయకులకు తగులుతుందన్నారుతెలంగాణలో ఉన్న బిజెపి నాయకులకు నిజంగా సొయి ఉంటే ఆడబిడ్డల పైన ప్రేమ,చిత్త శుద్ధి ఉంటే 50 శాతం మహిళ రిజర్వేషన్ బిల్లు ను,గ్యాస్ సిలిండర్ ధరను తగ్గించాలి.గ్యాస్ ధర తగ్గించే వరకు పోరాటం ఆగదని అన్నారు

# త్వరలో జగనన్నకు చెబుదాం కార్యక్రమం

**విజయవాడ :**

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తాడేపల్లిలో ఉంటారు. నియోజక వర్గాల్లో కార్యక్రమాలు ఉన్నపుడు మినహా సమీక్షలు, సమావేశాలు, భేటీలు ఆయన ఇంట్లోనే జరుగుతుంటాయి. తాడేపల్లి నివాసం నుంచే ముఖ్యమంత్రి కార్యకలాపాలు దాదాపు నాలుగేళ్లు సాగుతున్నాయి. అదే సమయంలో ముఖ్యమంత్రి మాత్రం ఆదుకోవాలని వచ్చే వారికి కనీసం దర్శనం కూడా ఇవ్వట్లేదనే అపవాదు ఉంది.ప్రజల నుంచి వచ్చే వినతులను సంతృప్తస్థాయిలో పరిష్కరించే లక్ష్యంతో జగనన్నకు చెబుదామనే కార్యక్రమాన్ని ప్రాంభించాలని రెండు మూడు నెలల క్రితం ముఖ్యమంత్రి భావించారు. ఒకటి రెండు సార్లు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలున్న శాఖల విభా?గాధిపతులతో చర్చలు కూడా జరిపారు. సమస్య రావడం ఆలశ్యం దానిని వెంటపడి పరిష్కరించాలని ఆదేశించారు.స్పందన కార్యక్రమంలో భాగంగా అత్యధిక అర్జీలు అందుకుంటున్న ప్రభుత్వ విభాగ అధిపతులతో ముఖ్యమంత్రి ఫిబ్రవరి మొదటి వారంలో కూడా సమీక్ష నిర్వహించారు. అర్జీల పరిష్కారంలో అనుసరించాల్సిన విధానాలపై సమగ్రంగా సమాలోచనలు చేశారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమం ప్రారంభానికి అధికారులు సన్నద్ధం కావాలని ఆదేశించారు. అయితే ఈ కార్యక్రమం ఎక్కడి వరకు వచ్చిందనే సంగతి మాత్రం మరచిపోయారు.ప్రతి ప్రభుత్వ విభాగాధిపతి ప్రతి వినతిని పరిష్కారం అయ్యేంతవరకూ ట్రాక్ చేయాలని, ప్రభుత్వానికి అందిన అర్జీలపై ప్రతి వారం కూడా ఆడిట్ చేయాలని, ప్రతి వారం కూడా నివేదికలు తీసుకోవాలని అధికారులను సూచించారు. నిజానికి క్షేత్రస్థాయిలో పరిష్కారం కాని సమస్యలు, రాజకీయ కారణాలతో మరుగున పడిపోయే సమస్యలు, రకరకాల కారణాలతో నెలలు, సంవత్సరాల తరబడి అపరిష్కృతంగా ఉండే ఫిర్యాదులతో నిత్యం ముఖ్యమంత్రికి మొర పెట్టుకునేందుకు సుదూర ప్రాంతాల నుంచి బాధితులు తాడేపల్లి వస్తుంటారు.గతంలో ఈ తరహా ఫిర్యాదుల కోసం ముఖ్యమంత్రులు ప్రత్యేకంగా సమయాన్ని కేటాయించే వారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్పందన కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఫిర్యాదుల్లో చాలా వరకు బుట్టదాఖలవడం, పరిష్కారాలు చూపకుండానే దరఖాస్తుల్ని క్లోజ్ చేస్తున్న ఉదంతాలున్నాయి. స్పందన స్థానంలో జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం ముఖ్యమంత్రి మదిలో మెదిలింది. ఫిర్యాదుల ట్రాకింగ్, పర్యవేక్షణ జరుగుతుందా? లేదా? అన్నదానిపై ప్రతివారం కూడా సమీక్ష చేయాలని సిఎం ఆదేశించారు. వివిధ ప్రభుత్వ విభాగాల్లో అర్జీలు, ఫిర్యాదుల స్వీకరణకు ఇప్పటికే ఉన్న కాల్ సెంటర్లను అనుసంధానించాలని, వివిధ విభాగాల్లో వినతుల పరిష్కారం కోసం ఇప్పటివరకూ ఉన్న పద్ధతులను మరోసారి పరిశీలించి, తిరిగి పునర్నిర్మాణం చేయాలని సూచించారు.సీఎంఓతో పాటు ప్రతి ప్రభుత్వ శాఖలో కూడా జగనన్నకు చెబుదాం ప్రాజెక్ట్ మానిటరింగ్ విభాగాలు ఉండాలి. తర్వాత జిల్లాస్థాయిలోనూ, మండలస్థాయిలో కూడా ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్స్ ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం కోసం మానిటరింగ్ యూనిట్లు మున్సిపాల్టీలు, కార్పొరేషన్ల స్థాయిలో కూడా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. స్థూలంగా స్పందనకు అత్యంత సమర్థవంతమైన, మెరుగైన విధానమే " జగనన్నకు చెబుదాం" అని చెప్పారు.

# పాపం... సుబ్బారావు గుప్తా...

**ఒంగోలు :**

ఇంతకీ ఈ సుబ్బారావు గుప్తా ఎవరంటారా? గతంలో సుబ్బారావు గుప్తాపై బాలినేని అనుచరుల దాడి తదనంతర పరిణామాలు అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. వైసీపీ ఎమ్మెల్యే బాలినేని అనుచరుల చేతిలో దెబ్బలు తిని రాష్ట్ర వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకున్న వ్యక్తే ఈ సుబ్బారావు గుప్తా. అప్పట్లో బాలినేని ప్రధాన అనుచరులు ఒక లాడ్జిలో సుబ్బారావు గుప్తాను కొడుతున్న వీడియో ఒకటి తెగ వైరల్ అయ్యింది. మంత్రి బాలినేని అనుచరులుగా ఉన్న వారి వల్ల పార్టీకి నష్టం జరుగుతుందంటూ సుబ్బారావు గుప్తా విమర్శించడంతో ఆయనను బాలినేని అనుచరులు ఒక లాడ్జి రూంలో చితక్కొట్టారు. మోకాళ్ల మీద కూర్చోబెట్టి క్షమాపణలు చెప్పించారు. ఆ తరువాతి రోజే బాలినేని తెరమీదకు వచ్చి సుబ్బారావు గుప్తాను ఇంటికి పిలిపించుకుని రాజీ చేసుకున్నారు. అయ్యిందేదో అయ్యింది... ఇక మనమంతా ఒకటే అంటూ కేకు కట్ చేసి ఎపిసోడ్ కు ఫుల్ స్టాప్ పెట్టారు.వైసీపీలో రెబల్ గా ఉన్నా, పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు చేసినా కష్టాలు ఎదుర్కోక తప్పదు. పార్టీ రెబల్ ఎంపీ రఘురామకృష్ణం రాజు, కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డిల తరువాత తాజాగా వైసీపీ నాయకుడు సుబ్బారావు గుప్తాకు కూడా అనుభవం లోకి వచ్చింది. గంజాయి కేసులో పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. అయితే గుప్తా మాత్రం ఆ తరువాత వైసీపీ రెబల్ గా మారారు. తనపై దాడి చేసిన వారికి పోలీసులు రాచమర్యాదలు చేసి మరీ స్టేషన్ బెయిల్ ఇచ్చారని విమర్శలు గుప్పించారు. పర్యటనలు చేసి మరీ రాష్ట్ర వ్యాప్తంగా తనకు మద్దతు కూడగట్టుకోవడానికి ప్రయత్నించారు. బెజవాడలో ఆర్య వైశ్య ఐక్యత సభ నిర్వహించి ఒంగోలులో చోట రాజన్, డీ గ్యాంగులు ఉన్నాయంటూ అప్పట్లో సంచలన వ్యాఖ్యలు చేశారు. సీఎం జగన్ పిలిచినా తాను కలవలేదని కూడా అప్పట్లో ప్రకటించారు. సరే నెమ్మదిగా ఆ వ్యవహారం అంతా సైడైపోయిందని అంతా భావించారు. కానీ అప్పటి నుంచీ సుబ్బారావు గుప్తా వైసీపీ రెబల్ గానే ఉంటూ వచ్చారు. ఇటీవలి కాలంలో సుబ్బారావు గుప్పా తన విమర్శల దాడిని తీవ్రం చేశారు. బాలినేని, ఆయన కుమారుడిపై ఆరోపణలు గుప్పిస్తున్నారు.బాలినేని అనుచరుడు సుభాని తన అనుచరులతో కలిసి ఒక వసతి గృహంపై దాడి చేసిన సంఘటనలో బాలినేని తీరును నిరసిస్తూ సుబ్బారావుగుప్తా తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. ఆ తరువాత రెండు రోజుల వ్యవధిలోనే సుబ్బారావు గుప్తాను గంజాయి కేసులో పోలీసులు అదుపులోనికి తీసుకుని విచారిస్తున్నారు. సుబ్బారావును పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఒంగోలులో సంచలనం సృష్టించింది. వైసీపీలో రెబల్ గా ఉంటే పోలీసుల మర్యాద ఇలాగే ఉంటుందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

# తిరుమలకు ఎలక్ట్రిక్ బస్సులు

**తిరుమల:**




తిరుమల శ్రీవారికి ఎంఈఐఎల్ (మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్) అందించే ఉచిత ఎలక్ట్రిక్ బస్సుల నమూనా సిద్ధమైంది. త్వరలోనే 10 ఎలక్ట్రిక్ బస్సులు టీటీడీకి అందనున్నాయి. ఆ తర్వాత తిరుమల కొండపై ఒలెక్ట్రా ఈ-బస్సులు సేవలు అందిచనున్నాయి.ఎంఈఐఎల్ గ్రూప్ అనుబంధ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్ టెక్? లిమిటెడ్ ఈ బస్సులను హైదరాబాద్ సమీపంలోని తన ప్లాంట్ లో తయారు చేస్తోంది. టీటీడీ మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించిన తొలి బస్సును దేవస్థానముల రవాణా విభాగం జనరల్ మేనేజర్ పివీ శేషారెడ్డి సమగ్రంగా పరిశీలించారు. ఒలెక్ట్రా తయారు చేసిన అత్యాధునిక సౌకర్యాలతో కూడిన 10 ఎలక్ట్రిక్ బస్సులను తిరుమల తిరుపతి దేవస్థానం(తితిదే)కు అందించాలని ఎంఈఐఎల్ నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ బస్సులను తిరుమలను సందర్శించే భక్తులకు కాలుష్య రహిత ప్రయాణం అందించేందుకు టీటీడీ వినియోగిం చనుంది. టీటీడీ అధికారులకు బస్సు పనితీరును ఒలెక్ట్రా ప్రతినిధులు వివరించారు. ప్రయాణికులకు పూర్తి భద్రత కల్పించేలా బస్సును తయారు చేశామని తెలిపారు. బస్సుల్లో ఎలెక్ట్రానిక్ డిస్ప్లే బోర్డ్ ద్వారా ఎక్కడి నుంచి ఎక్కడికి ప్రయాణిస్తోందో తెలిపే వివరాలు పొందుపరిచారు.భక్తులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తిరుమలలో తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు ఇది ఉపయోగ పడుతుంది, తిరుమల పవిత్రత, ప్రాశస్త్యాన్ని తెలిపే ఫోటోలను బస్సుపై పొందు పరిచారు. బస్సులో కొద్దిదూరం ప్రయాణించిన శేషారెడ్డి... పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. దేవస్థానం పాలకవర్గం, ఉన్నతాధికారులకు బస్సు పని తీరును వివరిస్తామని తెలిపారు. ఎంఈఐఎల్ విద్యుత్ బస్సులను అందించటం సంతోషంగా ఉందని, వీటి వల్ల తిరుమల కొండపై కాలుష్య నియంత్రణ జరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ లిమిటెడ్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కేవీ.ప్రదీప్ ఈ సందర్భంగా మాట్లాడుతూ "ఎంఈఐఎల్ భగవంతుని సేవలో ఎప్పుడూ ముందుంటుంది. సంస్థ ప్రయాణంలో వేంకటేశ్వర స్వామి ఇచ్చిన ఆశీర్వాదాలకు ఈ విధంగా కృతజ్ఞతలు తెలుపుకోగలుగుతున్నాము. సంస్థ పురోగతి, భవిష్యత్తు ప్రయత్నాలలో స్వామివారి ఆశీస్సులు తమపై ఉండాలని కోరుకుంటున్నాము. 9 మీటర్ల పొడువున్న 10 ఎలక్ట్రిక్ బస్సులను తిరుమల తిరుపతి దేవస్థానానికి త్వరలో అందించనున్నాము. ఈ-బస్సుల కోసం ఛార్జింగ్? పాయింట్లు కూడా ఏర్పాటు చేస్తున్నాము" అని తెలిపారు.శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తులకు పరిశుభ్రమైన, వాయు, శబ్ద కాలుష్యంలేని ప్రయాణాన్నిఈ విద్యుత్ బస్సుల ద్వారా అందిస్తామని ప్రదీప్ తెలిపారు. ఒలెక్ట్రా అందిస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు తిరుమలను పర్యావరణ హితంగా మార్చుతాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తిరుమలలో 12 డీజిల్ బస్సులు భక్తులకు సేవలు అందిస్తున్నాయి. త్వరలో ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సుల సేవలు ప్రారంభం అయితే టీటీడీకి డీజిల్ ఖర్చుల భారం తగ్గటంతో పాటు పర్యావరణం మెరుగుపడేందుకు ఎంతో అవకాశం కలుగుతుంది. ఇప్పటికే ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో 50 ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులు ప్రతిరోజూ తిరుపతి , తిరుమల మధ్య నడుస్తూ భక్తులకు సేవలందిస్తున్న విషయం తెలిసిందే.ప్రస్తుతం తిరుమలలో 12 డీజిల్ బస్సులు భక్తులకు సేవలు అందిస్తున్నాయి. త్వరలో ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సుల సేవలు ప్రారంభం అయితే టీటీడీకి డీజిల్ ఖర్చుల భారం తగ్గటంతో పాటు పర్యావరణం మెరుగుపడేందుకు ఎంతో అవకాశం కలుగుతుంది. ఇప్పటికే ఏపీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో 50 ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సులు ప్రతిరోజూ తిరుపతి , తిరుమల మధ్య నడుస్తూ భక్తులకు సేవలందిస్తున్న విషయం తెలిసిందే.

# విజయప్రియ నిత్యానంద ఎవరు...

**న్యూఢిల్లీ :**

విజయప్రియ నిత్యానంద ఎవరు..? ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా పలువురు ఆమె గురించి సెర్చ్ చేస్తున్నారు. భారత్ తో అత్యాచార ఆరోపణలు ఎదుర్కొంటున్న వివాదాస్పద మతగురువు నిత్యానంద 'కైలాస' అనే ప్రత్యేక దేశాన్ని స్థాపించారు. అయితే ఈ దేశానికి ప్రతినిధులుగా ఇటీవల ఐక్యరాజ్యసమితిలో విజయప్రియ నిత్యానంద కనిపించారు. తనను తాను 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస' ప్రతినిధిగా పరిచయం చేసుకున్నారు.హిందూమతం ఉట్టిపడేలా చీరకట్టు, ఆభరణాలు, మెడలో రుద్రాక్షమాల, నుదుటన బొట్టుతో ప్రపంచం చూపును తనవైపు ఆకర్షించుకుంది. హిందూమతంతోని ప్రాచీన సంప్రదాయాలను పునరుద్ధరించినందుకు నిత్యానంద వేధింపులకు గురవుతున్నారని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ కైలాస శాశ్వత ప్రతినిధిగా పరిచయం చేసుకుంటూ మాట్లాడారు. ఆయన పుట్టిన దేశమే ఆయన్ను నిషేధించారని అన్నారు.ప్రస్తుతం ఆమె గురించి ప్రపంచం అంతా శోధిస్తోంది. ఆమె ఫేస్‌బుక్ ప్రొఫైల్ ప్రకారం, ఆమె యునైటెడ్ స్టేట్స్‌లోని వాషింగ్టన్ డీసీలో నివసిస్తున్నారు. సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన ఓ ఫోటోలో విజయప్రియ తన కుడి చేతిపై నిత్యానంద టాటూను కలిగి ఉంది. విజయప్రియ తన లింక్డ్ ఇన్ ఫ్రొఫైల్ ప్రకారం ఆమె మానిటోబా యూనివర్సిటీ నుంచి మైక్రోబయాలజీలో బీఎస్సీ ఆనర్స్ చేసినట్లు, జూన్ జూన్ 2014లో యూనివర్సిటీ డీన్ హానర్ లిస్టులో కూడా ఈమె పేరు ఉంది. విజయప్రియకు ఇంగ్లీష్, ఫ్రెంచ్, హిందీ, క్రియోల్, పిడ్జిన్ భాషలు తెలుసని లింక్డ్ ఇన్ ప్రొఫైల్ లో ఉంది.ఇండియాలో కేసులు ఎదుర్కొంటున్న నిత్యానంద 2019 లో ఈక్వెడార్ తీరంలో ఒక ద్వీపంలో 'కైలాస'ని స్థాపించాడు. దీనిని ప్రత్యేక దేశంగా ప్రకటించుకున్నాడు. ఈ దేశానికి చట్టాలు, మంత్రులు, బ్యాంకులు ఇలా అన్నింటిని ఏర్పాటు చేశారు. 150 దేశాల్లో తమకు రాయబార కార్యాలయాలు, స్వచ్ఛంద సంస్థలు ఉన్నాయని 'కైలాస' వెబ్‌సైట్ కూడా పేర్కొంది. అయితే విజయప్రియ చేసిన వ్యాఖ్యలను పట్టించుకోవడం లేదని ఐక్యరాజ్యసమితి వెల్లడించింది.

# పీపీఎఫ్ లో 7.1 శాతం వడ్డీ

**హైదరాబాద్ :**

కేంద్ర ప్రభుత్వం వినియోగదారులకు పీపీఎఫ్ సౌకర్యాన్ని అందించింది. మీరు పీపీఎఫ్ స్కీమ్‌లో డబ్బును ఇన్వెస్ట్ చేస్తున్నట్లయితే, లేదంటే వచ్చే ఆర్థిక పథకంలో పెట్టుబడి పెట్టాలని ఆలోచిస్తున్నట్లయితే, ఈ శుభవార్త మీకు మాత్రమే. పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ పథకానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం శుభవార్త ప్రకటించింది. ఈ ప్లాన్‌లో మీరు చాలా ప్రయోజనాలను పొందుతారు.మార్చి 31 లోపు డబ్బును పెట్టుబడి పెట్టండి.. మీరు మార్చి 31 లోపు పన్ను ఆదా చేయాలనుకుంటే, మీరు మార్చి 5 లోపు పెట్టుబడి పెట్టాలి. ఎందుకంటే మీరు 1 నుండి 5 మధ్య పీపీఎఫ్ లో పెట్టుబడి పెడితే, మీకు ఆ నెల వడ్డీ లభిస్తుంది. ఇది కాకుండా వేరే చోట డబ్బు ఇన్వెస్ట్ చేస్తే 5వ తేదీలోపు పెట్టుబడి పెట్టాలి. వివిధ పెట్టుబడి ఎంపికల ద్వారా పొదుపు చేయడంతో పాటు పీపీఎఫ్ లో పెట్టుబడి పెట్టడం ద్వారా మీరు ఎలా పొదుపు చేసుకోవచ్చో.పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ పీపీఎఫ్ లో పెట్టుబడి పెట్టడానికి నియమాలు ఏమిటి? ముఖ్యంగా కార్మిక వర్గానికి ఇది మంచి ఎంపిక. మీరు ప్రతి నెల 5వ తేదీలోపు పీపీఎఫ్ లో పెట్టుబడి పెట్టవచ్చు. ఈ ప్లాన్‌లో మీకు 7.1 శాతం వడ్డీ లభిస్తుంది. ఈ పథకంలో, మీ డిపాజిట్ మొత్తాన్ని లెక్కించిన తర్వాత, నెల చివరి తేదీన ఖాతాలో డబ్బు జమ చేయబడుతుంది. మీరు కూడా నెల చివరి తేదీన మీ ఖాతాలో డబ్బు ఆదా చేయాలనుకుంటే, మీరు నెల 5వ తేదీలోపు డిపాజిట్ చేయాలి. మీరు 5 తర్వాత డబ్బు డిపాజిట్ చేస్తే, మీరు నష్టాలను చవిచూడాల్సి ఉంటుంది.

# ఆ ఫ్యామిలీ అంతా అంతేనా...

## తెరపైకి చిన్నకోడలు

**విజయనగరం :**

విజయనగరంలో 13 ఏళ్లపాటు భార్య సుప్రియను గృహ నిర్బంధంలో ఉంచిన న్యాయవాది గోదావరి మధుసూదనరావు కేసులో మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. తననూ కొన్నేళ్లపాటు గృహనిర్బంధంలో ఉంచారని.. భరించలేక ఆ ఇంటి నుంచి బయటకు వచ్చేశా అంటూ సుప్రియ తోడికోడలు.. గోదావరి మధుసూదనరావు సోదరుడు, వెంకట దుర్గాపప్రాద్ భార్య డెంటిస్ట్ వెంకట పుష్పలత తెలిపింది. తన పెద్ద కుమారుడు ఇప్పటికీ అక్కడే ఉన్నాడని, వెంటనే తనకు అప్పగించాలని విజయనగరంలోని అత్తింటి వారి ముందు గురువారం ఆందోళనకు దిగింది. విజయనగరంలోని కంటోన్మెంట్ ప్రాంతంలో 13 ఏళ్లపాటు గృహనిర్బంధంలో ఉన్న సుప్రియ బుధవారం ఆ చీకటి రోజుల నుంచి బయటపడ్డారు. ఆమెను తల్లి, సోదరుడు తమతోపాటు తీసుకెళ్లారు. ఈ విషయం సంచలనం కాగా.. గురువారం.. మధుసూదన్ తమ్ముడి భార్య తెరపైకి వచ్చారు. మధుసూదరావు సోదరుడు దుర్గాప్రసాద్ భార్య పుష్పలత అత్తింటివారి ఇంటికి వచ్చి నిరసన తెలియజేసింది. తన పెద్ద కుమారుడు పదేళ్ల గోదావరి దీర్ఘాయుష్ గాయత్రిబాబును అప్పగించాలని వేడుకుంది. 2012లో దుర్గాప్రసాద్‌తో ఆమెకు వివాహమైంది. వీరికి 2013లో పెద్ద కుమారుడు, 2015లో మరో కుమారుడు జన్మించారు. ఉన్నత చదువులు చదువుకున్నప్పటికీ.. పుష్పలతను సైతం సుప్రియ మాదిరి గృహ నిర్బంధానికే అత్తింటివారు పరిమితం చేశారు. ఇంట్లో పనులకే వినియోగించేవారు. బాత్రూమ్ దగ్గర కూర్చోబెట్టి కుక్కకు పెట్టినట్లు ఒక ప్లేటులో ఆహారం పెట్టేవారని పుష్పలత చెబుతోంది. తన తల్లిదండ్రులకు ఇబ్బంది కాకూడదనే ఉద్దేశంతోనే చాలా కాలం మౌనంగా భరించానని తెలిపింది. పెద్ద కుమారుడితోనే తనను పిన్ని అని పిలిపించేవారని వాపోయింది. తన కన్నకొడుకుని ఏనాడూ దగ్గరకు రానిచ్చేవారు కాదని చెప్పింది. అప్పట్లో ఏడాది వయస్సున్న చిన్న కుమారుడికి ఆరోగ్యం బాగోలేకపోతే కనీసం తనకు చూపించలేదని, అడిగితే.. 'చచ్చిపోతే చచ్చిపోనీయ్!' అంటూ నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారని కన్నీరు పెట్టుకుంది. గత్యంతరం లేని పరిస్థితుల్లో పెద్ద కుమారుడిని విడిచిపెట్టి, 2016లో చిన్నకుమారుడిని తీసుకుని ఆ ఇంటి నుంచి బయటపడ్డానని వివరించింది. పెద్ద కుమారుడికి కనీసం అమ్మగా కూడా తాను తెలియనని కన్నీటిపర్యంతమైంది. ఇన్నాళ్లూ తోడికోడలు సుప్రియ ఉందనే భరోసాతో కుమారుడిని విడిచిపెట్టానని తెలిపింది. ఇప్పుడు ఆమె కూడా లేకపోతే తన కుమారుడికి రక్షణ ఉండదని వాపోయింది. భర్త, అత్తింటివారి ఆగడాలపై గతంలోనే పోలీసులకు, గృహహింస విభాగ సిబ్బందికి కూడా ఫిర్యాదులు చేశానని తెలిపింది.పెద్ద కోడలుతోపాటు.. చిన్న కోడలినీ గృహనిర్బంధంలో ఉంచడం.. వరుసగా ఈ ఘటనలు వెలుగులోకి రావడం విజయనగరంలో చర్చనీయాంశంగా మారింది. అసలు గోదావరి మధుసూదనరావు, దుర్గాప్రసాద్, వారి తల్లి ప్రవర్తనపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అసలు వారెందుకు ఇలా ప్రవర్తిస్తున్నారో.. మున్ముందు వీరి కుటుంబం కోసం ఎలాంటివి వినాల్సి వస్తుందోనని చర్చించుకుంటున్నారు.

# అభివృద్ధి...సంక్షేమాన్ని విస్మరించవద్దు

## జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

**పెద్దపల్లి**

జిల్లాలోని అభివృద్ధి, సంక్షేమాన్ని అధికారులు విస్మరించవద్దని జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ సూచించారు. జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో జిల్లాలోని అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలతో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పై సమీక్షా సమావేశం నిర్వహించిన పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్ పలు అంశాలపై సూచనలు చేశారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలు అర్హులైన వారందరికీ అందేలా చూడాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన ఎంపీడీవోలు ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## అప్పన్నను దర్శించుకున్న మంత్రి కొట్టు

**విశాఖపట్నం**

విశాఖలో పారిశ్రామిక వేత్తలు సదస్సు లక్షల కోట్లు వస్తున్నాయని చెప్పుకొ నేది కాదని, ఒక ప్రణాళిక బద్ధంగా ముఖ్యమంత్రి పెడుతున్న సదస్సు అన్నారు మంత్రి కొట్టు సత్యనారాయ ణ.సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ మోహన్ రెడ్డిపై ఉన్న నమ్మకం తో భారతదేశం నుండే కాక, ప్రపంచ దేశాలనుండి పెట్టుబడిదారులు వస్తు న్నారని అన్నారు.రాష్ట్రంలో మౌలిక వసతుల కల్పనకు కావలసిన వన రులు పుష్కలంగా ఉన్నాయనే నమ్మ కం పారిశ్రామిక వేత్తలు కలిగిందని వెయ్యి కిలోమీటర్ల మేర కోస్టల్ కారి డార్ ఉండటం, వారి వారి ఉత్పత్తుల ను రవాణా చేసుకోవడానికి అనువైన ప్రదేశం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మని అన్నారు

## బై బై కేసీఆర్

హన్మకొండ

హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం, కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామివారిని కాంగ్రెస్ పార్టీ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి,మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తదితరులు దర్శించుకున్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ స్వతహాగా ముసలోడిని అయ్యాను అన్నారు.అందుకే మా కాంగ్రెస్ కార్యకర్తల నినాదం బై బై కేసీఆర్. కేసీఆర్ సిగ్గు లేకుండా చేత కాకా ఫార్మ్ హౌస్ లో పంటనంటుండు. భూపాలపల్లి, స్టేషన్ ఘనపూర్ లలో జరిగిన సభలలో సొంత పార్టీ నాయకులే కేటీఆర్ కాబోయే ముఖ్యమంత్రి అన్నారు. సొంత పార్టీ నాయకులే కేసీఆర్ కు చేత కాదని కృష్ణ,రామ అంటూ ఫార్మ్ హౌస్ లో శేష జీవితం గడపాలని కోరుకుంటున్నారు. భూపాలపల్లి లో 144 సెక్షన్ పెట్టడం స్థానిక ఎమ్మెల్యే కుట్రలు,అక్రమాలు,భూకబ్జా, సాయిల్డ్ తవ్వకాలు లాంటి ఎక్కడ బయట పడతాయో అని కుట్రపూరిత చర్యలు చేసారని అన్నారు.
రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పాలనలోకి వస్తే ప్రతి పేదవాడికి ఇల్లు,2 లక్షల ఉద్యోగాలు మంజూరు చేస్తాం అన్నారు.

## బై బై కేసీఆర్

**హన్మకొండ**

హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం, కొత్తకొండ శ్రీ వీరభద్ర స్వామివారిని కాంగ్రెస్ పార్టీ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి,మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ తదితరులు దర్శించుకున్నారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కేసీఆర్ స్వతహాగా ముసలోడిని అయ్యాను అన్నారు.అందుకే మా కాంగ్రెస్ కార్యకర్తల నినాదం బై బై కేసీఆర్. కేసీఆర్ సిగ్గు లేకుండా చేత కాకా ఫార్మ్ హౌస్ లో పంటనంటుండు. భూపాలపల్లి, స్టేషన్ ఘనపూర్ లలో జరిగిన సభలలో సొంత పార్టీ నాయకులే కేటీఆర్ కాబోయే ముఖ్యమంత్రి అన్నారు. సొంత పార్టీ నాయకులే కేసీఆర్ కు చేత కాదని కృష్ణ,రామ అంటూ ఫార్మ్ హౌస్ లో శేష జీవితం గడపాలని కోరుకుంటున్నారు. భూపాలపల్లి లో 144 సెక్షన్ పెట్టడం స్థానిక ఎమ్మెల్యే కుట్రలు,అక్రమాలు,భూకబ్జా, సాయిల్డ్ తవ్వకాలు లాంటి ఎక్కడ బయట పడతాయో అని కుట్రపూరిత చర్యలు చేసారని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ పాలనలోకి వస్తే ప్రతి పేదవాడికి ఇల్లు,2 లక్షల ఉద్యోగాలు మంజూరు చేస్తాం అన్నారు.

## సాగునీటికోసం రైతుల అందోళన

**విజయవాడ**

ఎన్టీఆర్ జిల్లా జమలాపురం మేజర్ కాలువకు సాగునీటి విడుదల చేయాలని రైతులు జాతీయ రహదారి (30) పై ఆందోళనలకు దిగారు. ఏ.కొండూరు మండలంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యర్యంలో రాస్తారోకో నిర్వహించారు. విజయవాడ జగదల్ పూర్ జాతీయ రహదారిపై జమలాపురం మేజర్ కాలువ లో నీటిని వెంటనే విడుదల చేయాలని రైతులు రైతు సంఘం నాయకులు డిమాండ్ చేసారు. ఈ నేపథ్యంలో సిపిఎం నాయకులు, రైతులు, పోలీసుల మధ్య తోపులాట జరిగింది. రోడ్డు పై ధర్నా చేస్తున్న రైతులను రైతు సంఘం నాయకులును అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.

## కెరీర్ గైడెన్స్ పై విద్యార్థులకు అవగాహన

**నాగర్ కర్నూల్**

లింగాల మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాలలో శుక్రవారం శ్రామిక వికాస కేంద్రం ఆధ్వర్యంలో 10వ,తరగతి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా శ్రామిక వికాస కేంద్రం మండల కో ఆర్డినేటర్ యం శ్రీనివాసులు మాట్లాడుతూ కెరీర్ అనేది ఒక వ్యక్తి యొక్క అనేక సంవత్సరాల జీవితాన్ని ప్రభావితం చేసే ఒక క్లిష్టమైన ఎంపిక. కోర్సు మరియు కెరీర్ ఎంపికలను జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవడం చాలా ముఖ్యం.10వ తరగతి పూర్తయిన తర్వాత చాలా మంది విద్యార్థులు 2 సంవత్సరాల కోర్సు అయిన ఇంటర్మీడియట్‌ను ఎంచుకుంటారు. విద్యార్థులు సైన్స్, కామర్స్ మరియు మాథ్స్ మూడింటిలో ఒక సబ్జెక్టును ఎంచుకోవచ్చు. ఎంట్రన్స్ ద్వారా పాలిటెక్నిక్ కోర్సులలో మెకానికల్, ఆటోమొబైల్, సివిల్, కెమికల్స్ మరియు కంప్యూటర్ వంటి పాలిటెక్నిక్ కోర్సులను అభ్యసించవచ్చు. మనకు జిల్లా లో అందుబాటులో పాలిటెక్నిక్ కళాశాలలు మరియు జూనియర్ కళాశాలలు ఉన్నాయని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలోఆశ్రమ పాఠశాల హెడ్మాస్టర్ మసమ్మ. విద్యార్థిని తదితరులు పాల్గొన్నారు.

# కోటంరెడ్డి లెక్క తప్పిందే

**నెల్లూరు :**

నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి రాజకీయంగా ఇక అన్ని దారులు మూసుకుపోయినట్లేనని తెలుస్తోంది. ఆయన తొందరపడి అధికార పార్టీ నుంచి బయటకు వచ్చారని ఆయన అనుచరుల్లో సయితం అభిప్రాయం బలంగా వ్యక్తమవుతుంది. నెల్లూరు జిల్లాలో కోటంరెడ్డి చేరికపై టీడీపీ నేతల నుంచి వ్యతిరేకం వ్యక్తం కావడంతో ఆయనను చేర్చుకోవడంపై పార్టీ అధినేత చంద్రబాబు కూడా కొంత పునరాలోచనలో పడ్డారని చెబుతున్నారు. దీంతో కోటంరెడ్డి రాజకీయంగా అటు కాకుండా.. ఇటు కాకుండా.. ఎటూ కాకుండా పోయారన్న టాక్ సింహపురిలో బలంగా వినిపిస్తుంది. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి తాను టీడీపీలోకి వెళుతున్నట్లు నేరుగా కార్యకర్తల సమావేశంలోనే ప్రకటించారు. అయితే కోటంరెడ్డి రాకను పార్టీ సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డితో పాటు మరికొందరు నేతలు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. టీడీపీ టిక్కెట్ దక్కించుకని గెలిచిన తర్వాత తిరిగి వైసీపీ గూటికి కోటంరెడ్డి వెళ్లినా ఆశ్చర్యం లేదని వారు చంద్రబాబు వద్ద ఎదుట చెప్పినట్లు తెలిసింది. కోటంరెడ్డి పై పరోక్షంగా సీనియర్ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి కూడా కామెంట్స్ చేశారు. కోవర్టులు వస్తున్నారంటూ జాగ్రత్తగా ఉండాలంటూ పార్టీ నేతలను ఆయన హెచ్చరించడం కూడా చర్చనీయాంశమైంది. స్థానిక టీడీపీ నేతలు కూడా కోటంరెడ్డికి వ్యతిరేకంగా సమావేశాలు పెడుతున్నారు. కోటంరెడ్డి తన ఫోన్ ట్యాపింగ్ చేశారంటూ వైసీపీ నుంచి బయటపడ్డారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఆయనకు ఇక నియోజకవర్గంలో అన్ని రకాలుగా అధికార పార్టీ లాక్ చేసింది. వెంటనే ఇన్‌ఛార్జిగా ఆదాల ప్రభాకర్ రెడ్డిని నియమించి అధికార యంత్రాంగం మొత్తం ఆదాల కనుసన్నుల్లోనే పని చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో కోటంరెడ్డి ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నా ఎలాంటి ప్రయోజనం లేదు. అధికారులు ప్రొటోకాల్ కూడా పాటించడం లేదు. ఎన్నికలకు ఇంకా ఏడాది ముందుగానే కోటంరెడ్డి తీసుకున్న నిర్ణయం ఆయనను రాజకీయంగా ఇబ్బందుల పాలు చేసిందనే చెప్పాలి. ఇక వరసగా టీడీపీ అధినేత చంద్రబాబు ఇతర పార్టీల నేతలకు కండువాలు కప్పుతున్నారు. కానీ కోటంరెడ్డి విషయంలో మాత్రం కండువా కప్పకపోయినా పాజిటివ్ గా లేరంటున్నారు. ఒక్క నేత వచ్చినంత మాత్రాన పార్టీ జిల్లాలో మరింత ఇబ్బందుల్లో పడుతుందని ఆయన భావిస్తున్నారు. టీడీపీకి కోటంరెడ్డి చేరిక వల్ల కొత్తగా వచ్చే లాభమేదీ లేదు. వైసీపీకి జరగాల్సిన నష్టం జరిగిపోయింది. గత నాలుగేళ్లుగా పార్టీ కోసం కష్టపడుతున్న నేతలను ఇబ్బంది పెట్టి కోటంరెడ్డికి రెడ్ కార్పెట్ వేయడం సరికాదన్నది చంద్రబాబు భావనగా ఉంది. అందుకే కోటంరెడ్డి లెక్క తప్పిందంటున్నారు. ఆయన ఇప్పుడు మరో పార్టీవైపు చూడాల్సిందే. జనసేన కూడా అతనిని నమ్మి టిక్కెట్ ఇచ్చే పరిస్థితి ఉంటుందా? అన్నది కూడా సందేహమే. ఇక కోటంరెడ్డికి బీఆర్ఎస్ నుంచి పోటీ చేయడం మినహా మరో దారి లేదని చెబుతున్నారు. మరి కోటంరెడ్డి పొలిటికల్ ఫ్యూచర్ ఎలా ఉండనుందన్నది రానున్న కాలంలో తెలియాల్సిందే.

## దేశీ ఎగుమతుల కోసం డాక్ ఘర్ నిర్యత్ కేంద్రం

**పెద్దపల్లి**

ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఇప్పటికే వివిధ సేవలను విస్తృత పర్చిన భారత తపాల శాఖ తాజాగా విదేశాలకు వస్తువులు, పార్సిల్స్ ఎగుమతి చేసే వ్యక్తులు, సంస్థలకు కూడా శుభవార్త చెప్పింది. తక్కువ ఖర్చుతో సులభ పద్దతిలో త్వరగా విదేశాలకు వస్తువులను పంపించేందుకు ప్రత్యేకంగా డాక్ ఘర్ నిర్యత్ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ఆ సేవల వివరాలపై పెద్దపల్లి డివిజన్ పోస్టల్ ఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. భారత తపాల శాఖ విదేశాలకు వస్తువులు, తిను బండారాలు, మందులు, గిఫ్ట్ ఆర్టికల్స్, ఇతర సామాగ్రిని ఎగుమతి చేసే సంస్థల కోసం ప్రత్యేకంగా డాక్ ఘర్ నిర్యత్ కేంద్రాన్ని ప్రారంభించిందని పేర్కొన్నారు. ఇంపోర్టు అండ్ ఎక్స్ పోర్టు లైసెన్స్ కష్టమర్ కోడ్ కలిగిన సంస్థలు ఈ డీఎన్కే ద్వారా సులభరీతిలో ఎటువంటి శ్రమ లేకుండా విదేశాలకు ఎగుమతి చేసుకోవచ్చునని, ఫ్రీ హోం పికప్ తోపాటు అతి తక్కువ ధరలో పార్సిల్ ప్యాకేజింగ్ యూనిట్ ద్వారా ప్రత్యేకంగా ప్యాక్ చేయడం కూడా జరుగుతుందని వివరించారు. ఎగుమతిదారులు వారి కార్యాలయంలోనే అన్ని వివరాలను వారికీ అందించిన సాఫ్ట్ వేర్ లో డైరెక్ట్ గా పోస్టాఫీస్ నిర్యత్ కేంద్రంలో ఎటువంటి ఆలస్యం లేకుండా అందించవచ్చునని, తద్వారా వారికి కస్టమ్స్ చెకింగ్ లో కూడా ఎటువంటి ఇబ్బంది ఉండదని, త్వరగా విదేశాలకు ఎగుమతి అవుతాయని తెలిపారు. ఇందుకోసం పెద్దపల్లి హెడ్ పోస్ట్ ఆఫీస్ పరిధిలో డాక్ ఘర్ నిర్యత్ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎక్స్పోర్ట్ వ్యాపారం చేసే సంస్థలు, విదేశాలకు వస్తువులు పంపించే ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు కోరారు.

## కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

**నాగర్ కర్నూల్**

మున్సిపాలిటీ, గ్రామీణ ప్రాంతములో 18 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించేవిధంగా చూడాలని జిల్లా కలెక్టర్ పి. ఉదయ్ కుమార్ ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం బిజినేపల్లి మండలంలోని వెలుగొండ గ్రామ పంచాయతిలో నిర్వహిస్తున్న కంటి వెలుగు పరీక్షల శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఏ ఒక్కరు మిగిలిపోకుండా ప్రతి ఒక్కరినీ వైద్య శిబిరానికి తీసుకువచ్చి పరీక్షలు నిర్వహించాలన్నారు. వైద్య సిబ్బంది ని వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెలుగొండ గ్రామంలో 3974 మంది 18 సంవత్సరాల వయస్సు దాటిన వారు ఉండగా ఇక్కడ వైద్య శిబిరం ప్రారంభమై 3 రోజులు అవుతుందన్నారు. ఈ రోజు వరకు 570 మందికి గ్రామంలో కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని వీరిలో 40 శాతం మందికి కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందని మెడికల్ ఆఫీసర్ తెలిపారు. దగ్గరి చూపు అద్దాలు వెంబడే ఇవ్వడం జరుగుతుందని, దూరం చూపు ఇతర సిలిండర్ సమస్యలు ఉన్నవారి వివరాలు ఆన్లైన్ లో నమోదు చేసుకొని 15 రోజుల్లో తెప్పించి ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కంటి పరీక్షల విషయంలో కానీ, కంటి అద్దాల విషయంలో క్వాలిటి కంట్రోల్ డి.డి.యం ద్వారా ఎప్పటికప్పుడు తనిఖీలు జరగాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని ఆదేశించారు. విరిగిపోయిన అద్దాలు ఉంటే పక్కకు పడేయాలని ఎట్టిపరిస్థితిలోను వాటిని ఇవ్వవద్దని ఆదేశించారు. ఈ రోజు 161 మంది వెలుగొండ వైద్య శిబిరంలో కంటి పరీక్షలు చేయించుకున్నట్లు గుర్తించారు.
నాగర్ కర్నూల్ జిల్లాలో ఈ రోజు వరకు 2,28,430 మందికి కంటి పరీక్షలు నిర్వహించడం జరిగిందని ఇందులో 24, 424 మందికి దగ్గరి చూపు అద్దాలు ఇవ్వడం జరిగిందన్నారు. దూరపు చూపు సమస్య ఉన్నవారు 17,365 మందిని గుర్తించి ఆన్లైన్ ద్వారా కంటి అద్దాల కై పంపించగా ఇప్పటి వరకు 5136 అద్దాలు జిల్లాకు రావడం జరిగిందన్నారు. వచ్చిన అద్దాలను ఎవరి అద్దాలు వారికే ఇచ్చేవిధంగా చూడాలని బార్ కోడ్ ఆధారంగా అద్దాలు పంపిణీ జరగాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన మొత్తం 50 కంటివెలుగు వైద్య బృందాలు నిరాటంకంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాయని తెలియజేసారు. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. సుధాకర్ లాల్, గ్రామ సర్పంచ్ కురువమ్మా, బిజినేపల్లి తహిసిల్దార్ అంజిరెడ్డి, వైద్య సిబ్బంది తదితరులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.

## చెంచుపెంటలో నాలుగు పూరి గుడిసెలు దగ్ధం

**నాగర్ కర్నూల్**

నాగర్ కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని నల్లమల అడవిలోని లోతట్టు ప్రాంతమైన రాంపూర్ చెంచుపెంటలో శుక్రవారం తెల్లవారుజామున వరుసగా నాలుగు పూరిగుడిసెలో అకస్మాత్తుగా మంటలు చెలరేగి నాలుగు పూరి గుడిసెలు పూర్తిగా దగ్ధమయ్యాయి. సర్పంచ్ బాల గురువయ్య వివరాల ప్రకారం.. నల్లమల లోతట్టు అడవి ప్రాంతంలోని రాంపూర్ పెంటకు చెందిన చిగుర్ల లక్ష్మయ్య, నిమ్మల పాపయ్య, నిమ్మల బాలమ్మ, మరియు మినీ అంగన్వాడీ గుడిసె పూర్తిగా దగ్ధమయ్యాయి. తెల్లవారుజామున సుమారు 5 గంటల సమయంలో



గుడిసెలకు మంటలు అంటుకుని ఆ గుడిసెలు పూర్తిగా దగ్ధమైనట్లు వారు తెలిపారు. ఈ ఘటనలో సుమారు విలువైన 3 సోలార్ లైట్‌లతో.. ఇంట్లోని వంట సామానుతో సహా బీరువాలు, ఇతర సామాన్లు పూర్తిగా దగ్ధమై సుమారు 3 లక్షల వరకు నష్టం జరిగినట్లు ఆ కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటన జరగడంతో ఆ కుటుంబ సభ్యులు ప్రాణాలను వారి చేతిలో పెట్టుకొని బయటపడ్డారు. మంటలతో అయోమయంలో గిరిజనులునల్లమల్ల లోతట్టు అటవీ ప్రాంతంలోని రాంపూర్ చెంచుపెంటలో మొత్తం 25 కుటుంబాలు ఉన్నాయి. పూరి గుడిసెలను ఆధారంగా చేసుకుని తమ జీవనం కొనసాగిస్తున్నారు. ఇదే నేపథ్యంలో గిరిజనుల గుడిసెలలో తరచుగా మంటలు అంటుకుని కాలి బూడిద అవుతున్నాయి. ఈ ఘటనలను చూసి ఆ గిరిజనులు అయోమయంలో పడుతున్నారు. అడవినే నమ్ముకుని జీవనం సాగిస్తున్నవారి గుడిసెలు రెండు మూడు రోజులకు తరచుగా కాలిపోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తుంది. ప్రభుత్వం తమపై దయవుంచి తమను ఆదుకుని తమకు పక్కా ఇల్లు కట్టించాలని ఆ గిరిజనులు కోరుతున్నారు.

## మల్లాపూర్ లో రేవంత్ పర్యటన

**హన్మకొండ**

మల్లాపూర్ లో టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. అక్కడ మహిళలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గెలిచిన తరువాత ఎమ్మెల్యే రసమయి గ్రామాల్లోకి రావడమే లేదని మహిళలు అన్నారు. తమ సమస్యలు వినే వారు లేరని ఆవేదన వ్యక్తం చేసారు. మల్లాపూర్ లో చిరువ్యాపారుల సమస్యలు తెలుసుకున్నారు రేవంత్. చిరు వ్యాపారులకు బ్యాంకు నుంచి రావాల్సిన రుణాలు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. మహిళా సంఘాలకు ఇవ్వాల్సిన రుణాలు ఇవ్వడం లేదు. కనీసం తనకు పెన్షన్ రావడం లేదని మధురమ్మ అనే వృద్ధురాలు అన్నది. ఈసారి మహిళా శక్తిని చాటి ప్రభుత్వానికి బుద్ధి చెబుతామని మహిళలు అన్నారు. తమ బిడ్డలకు పీజీలు చదివించినా ఉద్యోగాలు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని రేవంత్ హామీనిచ్చారు.

## మళ్లీ కట్టెల పోయిన మీద వంట చేసుకోవాలా

**బంజారాహిల్స్**

నానాటికి పెరుగుతున్న గ్యాస్ ధరలు సామాన్యుల బతుకులను చిద్రం చేస్తున్నాయని బీఆర్ఎస్ నాయకులు మన్నె గోవర్ధన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బంజారాహిల్స్ కేబీఆర్ పార్క్ వద్ద పెంచిన సిలిండర్లకు నిరసనగా ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. 2014లో అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం 400 ఉన్న గ్యాస్ సిలిండర్ను 1200 కు పెంచిన ఆగ్రహం చేశారు. ఇలా పెరిగిన ధరల కారణంగా పేద మధ్యతరగతి ప్రజలు జీవనం కొనసాగించడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశాన్ని దేశ ప్రజలను ఉన్నతంగా తీర్చిదిస్తారని భావించిన మోడీ సర్కారు అన్ని రంగాలలో వెనుక పడతానని అనుభవిస్తూ దేశ ప్రజలపై మోయలేని భారాన్ని మోపుతుందని మండిపడ్డారు. పెరుగుతున్న గ్యాస్ సిలిండర్ ధరతో పాటు నిత్యవసర వస్తువులు ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతుండడంతో బతకడం కష్టంగా మారుతుందని మహిళా ఆవేదన వ్యక్తం చేసింది. పిల్లల చదువులు అనారోగ్య సమస్యలు ఇంటి అద్దెలు ఏది చెల్లించాలో అర్థం కాని దుస్థితిలో జీవనం కొనసాగిస్తున్నామని విచారం వ్యక్తం చేసింది.

## పోలీసు కస్టడికి హరిహర కృష్ణ

**రంగారెడ్డి**

రంగారెడ్డి జిల్లా అబ్దుల్లపూర్ మెట్టు నవీన్ మర్డర్ కేసులో నిందితుడు హరిహర కృష్ణను పోలీసులు శుక్రవారం నాడు చర్లపల్లి జైలు నుండి కస్టడి కి తీసుకున్నారు. విచారణ నిమిత్తం మొదటగా ఎల్బీనగర్ ఎస్ఓటి ఆఫీసుకు తీసుకువచ్చారు. తరువాత రణ మర్డర్ జరిగిన ప్లేస్ లో సీన్ రీ కన్స్ట్రక్షన్ చేసాడు.

## గ్యాస్ ధరలు పెంచడం పేద లకు భారం

**ఇబ్రహీంపట్నం**

రాష్ట్ర ప్రభుత్వాల ఎన్నికలు అయిపోయిన వెంటనే ప్రతిసారి గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడం కేంద్ర ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిందని తాజాగా కేంద్ర ప్రభుత్వం భారీగా గ్యాస్ సిలిండర్ ధరలను పెంచడంపై ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో కాళీ సిలిండర్లు కట్టెల మోపుతో ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మహిళ నాయకులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గృహ అవసరాల సిలిండర్ ధరను 50 రూపాయలు, కమర్షియల్ సిలిండర్ ధరను 350 రూపాయలు పెంచిందంటు ఆయా రాష్ట్రాల్లో ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్న వెంటనే ఈరోజు ఇంత భారీగా సిలిండర్ ధరను పెంచడం దారుణమన్నారు.
మహిళా దినోత్సవం సందర్భంగా దేశ మహిళలకు ప్రధానమంత్రి మోడీ ఇచ్చిన కానుకని ఎమ్మెల్యే మంచిరెడ్డి అన్నారు.పెరుగుతున్న సిలిండర్ ధరలు,నిత్యవసర సరుకుల పెరుగుదలపై కేంద్ర ప్రభుత్వాన్ని నిలదీస్తూ నేడు ఎక్కడికక్కడ పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలను చేపట్టానున్నట్లు తెలిపారు.

## దంపతుల ఆత్మహత్యాయత్నం

**నిర్మల్**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని బేస్తవార్ పేటలో పురుగుల మందు తాగి దంపతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే జిల్లా కేంద్రంలోని చింతకుంటవాడలో చంద్రశేఖర్ - లక్ష్మి అనే దంపతులు రెండు వ్యాపార మడిగెల చేపడుతున్నారు. అయితే ఈ దుకాణ సముదాయ నిర్మాణానికి కాలనీ కమిటీ ఐదు లక్షల రూపాయలు చెల్లించాలని డిమాండ్ చేసి అగ్రిమెంట్ రాసుకున్నారు. దీంతో చంద్రశేఖర్కు డబ్బులు సమకూరకపోవడం, కమిటీ ఒత్తిడి చేయడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు కాలనీవాసులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ దంపతులను జిల్లా ఆసుపత్రికి చికిత్సలు అందజేస్తున్నారు, వీరిలో భర్త పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు పేర్కొన్నారు. కాలనీ వాసుల వైఖరిని నిరసిస్తూ నిర్మల్ జిల్లా కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం దుకాణాల బందుకు పిలుపునిచ్చింది. దీంతో నిర్మల్లోని ఆర్యవైశ్యులు దుకాణాలను మూసి ఉంచి సంఘీభావం తెలిపారు. విషయాన్ని తెలుసుకున్న నిర్మల్ డిఎస్పి జీవన్ రెడ్డి జిల్లా ఆస్పత్రిలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ దంపతుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంఘటనకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# ఎమ్మెల్సీ ఎన్నికలు-ఎవరి దారి వారిదే

**విశాఖపట్టణం :**

జనసేన పార్టీతో కలిసే పోటీ చేస్తున్నాం అధికారంలోకి వస్తున్నాం అని బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు సోము వీర్రాజు ప్రెస్ మీట్ పెట్టినప్పుడల్లా ప్రకటిస్తూంటారు. అలాగే జనసేన పార్టీ కూడా పొత్తుల గురించి ప్రస్తావన వచ్చినప్పుడు తాము ఇంకా బీజేపీతోనే పొత్తులో ఉన్నామని చెబుతూ ఉంటారు. అంటే రెండు పార్టీల్లోనూ ఓ రకంగా ఇంకా తాము పొత్తుల్లోనే ఉన్నామన్న అభిప్రాయం ఉంది. కానీ అది క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదు. దానికి ఉదాహరణే ప్రస్తుతం ఏపీలో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీకి జనసేన మద్దతు ప్రకటించకపోవడం. మర్యాదపూర్వకంగానైనా మద్దతు ఇవ్వాలని పవన్ ను అడగాలనే ఆలోచన బీజేపీ చేయలేదు. అడగనిదే ఎందుకు మద్దతివ్వాలని పవన్ కూడా మిత్రపక్షానికి ఓటేయాలని పిలుపునివ్వలేదంటున్నారు. తిరుపతి లోక్ సభ ఉపఎన్నికల్లో తాము పోటీ చేస్తామంటే తాము పోటీ చేస్తామని అటు బీజేపీ ఇటు జనసేన పోటీ పడ్డాయి. చివరికి బీజేపీ పోటీ చేయడానికి అంగీకారం కుదిరింది. పవన్ కల్యాణ్ కూడా ప్రచారం చేశారు. అయితే ఫలితం ఏ మాత్రం ప్రోత్సాహకరంగా లేదు. తర్వాత బద్వేలు, ఆత్మకూరు ఉపఎన్నికలు వచ్చాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలు చనిపోవడం.. కుటుంబసభ్యులకే చాన్సివ్వడంతో పవన్ కల్యాణ్ జనసేన పోటీ చేయదని ప్రకటించారు. కానీ బీజేపీ మాత్రం పోటీ చేసింది. పవన్ కల్యాణ్ మద్దతు తమకేనని ప్రచారం చేసుకున్నారుఆ పార్టీ నేతలు. ఇప్పుడు మూడు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల్ని ప్రకటించింది. కానీ జనసేన పార్టీ మద్దతు గురించి మాత్రం స్పందించడం లేదు. తమంతటకు తాముగానే ప్రచారం చేసుకుంటున్నారు. మార్చి 14వ తేదీన మచిలీపట్నంలో జనసేన ఆవిర్భావ సభ నిర్వహించాలనుకుంటున్న జనేసన పార్టీ.. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించిన తర్వాత ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీకి మాత్రం వేయవద్దు.. మీ ఇష్టం వచ్చినవారికి వేయండి అని పార్టీ సానుభూతిపరులకు నాదెండ్ల మనోహర్ సందేశం పంపారు. ఇదే పవన్ కల్యాణ్ సందేశం అని ప్రకటించారు. దీంతో రాజకీయ పార్టీల్లో ఆశ్చర్యం వ్యక్తమవుతోంది. బీజేపీతో పొత్తులో ఉన్న పవన్ కల్యాణ్ తాము పోటీ చేయకపోతే మిత్రపక్షం బీజేపీకి ఓటు వేయాలని ప్రకటన చేయవచ్చు కదా అనే సందేహం వారికి రావడమే దీనికి కారణం. ఎంత మిత్రపక్షం అయినప్పటికీ మద్దతు కోరడం సంప్రదాయం. ఏపీ బీజేపీ నేతలు ఇంత వరకూ పవన్ కల్యాణ్ మద్దతు కోరినట్లుగా స్పష్టత లేదు. ఆ మాటకు వస్తే ఇటీవలి కాలంలో పవన్ కల్యాణ్ ఏ ఒక్క బీజేపీ నేత కలవలేదు. ప్రస్తుతం ఏపీ బీజేపీలో పరిస్థితులు అంత గొప్పగా లేవు. వర్గాలుగా మారి విమర్శలు చేసుకుంటున్నారు. కొంత మంది పార్టీ మారుతారన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుత ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజుపై ఎక్కువ అసంతృప్తి కనిపిస్తోంది. దీంతో ఆయన కూడా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం కోసం తిరుగుతున్నారుకానీ.. పవన్ ను కలిసి మద్దతు అడగాలనే ఆలోచన చేయలేదు. పవన్ మద్దతు అడగకపోవడంతో.. అడగకుండా మద్దతు ఇవ్వడం ఎందుకని పవన్ కల్యాణ్ కూడా సైలెంట్ అయినట్లుగా చెబుతున్నారు. ఉత్తరాంధ్రలో జనసేన పార్టీకి యువత నుంచి కూడా మద్దతు ఉంటుంది. అక్కడ సిట్టింగ్ ఎమ్మెల్సీ మాధవ్ మళ్లీ పోటీ చేస్తున్నారు. పవన్ మద్దతిస్తే ప్లస్ అయ్యేది. కానీ ఆయన మద్దతు కోసం బీజేపీ ఎలాంటి ప్రయత్నాలు చేయకపోవడం ఆశ్చర్యకరంగా మారింది. పవన్ కల్యాణ్.. ఏపీ ఎన్నికల్లో ఖచ్చితంగా బీజేపీతో కలిసి పోటీ చేస్తానని చెప్పడం లేదు. సందర్భాన్ని బట్టి ప్రకటనలు చేస్తున్నారు. అదే సమయంలో బీజేపీ నేతలు జనసేనను కలుపుకుని రాజకీయం చేద్దామన్న ప్రయత్నం చేయడం లేదు. దీంతో రెండు పార్టీల మధ్య బయట ప్రకటనల్లో చెబుతున్నంత గొప్పగా పొత్తు లేదని.. ఎవరికి వారే అన్నట్లుగా ఇప్పటికే విడిపోయారన్న భావం బలపడుతోంది.

# ప్రగతి భవన్ వర్సెస్ రాజ్ భవన్

**హైదరాబాద్ :**

ప్రగతిభవన్, రాజ్‌భవన్ మధ్య సంబంధాలు పూర్తిగా తెగిపోయినట్టే కనిపిస్తున్నాయ్. అవును, గవర్నర్ అండ్ గవర్నమెంట్ మధ్య ఎవరూ పూడ్చలేనంతగా అగాధం ఏర్పడింది. అందుకు రుజువే లేటెస్ట్ ఎపిసోడ్. గవర్నర్ టార్గెట్‌గా అత్యున్నత న్యాయస్థానం మెట్లెక్కింది కేసీఆర్ సర్కార్.. మరి, తెలంగాణ ప్రభుత్వ రిట్ పిటిషన్‌పై సుప్రీం ఎలా రియాక్ట్ కాబోతుంది!. ఊరట లభిస్తుందా? లేదా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఎవర్ని ఎలా హ్యాండిల్ చేయాలో నాకు తెలుసు, నేను గైనకాలజిస్ట్‌ని, ఆమాత్రం తెలియదా నాకు!. సరిగ్గా నెలరోజులక్రితం గవర్నర్ తమిళిసై చేసిన వ్యాఖ్యలివి. ఈ కామెంట్స్ ఎవర్నుద్దేశించి చేశారో ఊహించుకోవచ్చు. గవర్నర్ స్పీచ్ లేకుండానే బడ్జెట్ సమావేశాలను కానిచ్చేయాలనుకున్న ప్రభుత్వాన్ని దారిలోకి తెచ్చుకున్న తమిళిసై అదే పంథా కంటిన్యూ చేస్తున్నారు. దానికి రుజువే లేటెస్ట్ ట్విస్ట్. బడ్జెట్ సమావేశాల టైమ్‌లో కోర్టుకెళ్లి వెనక్కితగ్గిన రాష్ట్ర ప్రభుత్వం, ఇప్పుడు మళ్లీ సుప్రీం గడప తొక్కింది. బిల్లులు ఆమోదించడం లేదంటూ అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. రాజ్‌భవన్, ప్రగతిభవన్ మధ్య దూరం ఎంతగా పెరిగిపోయిందో చెప్పడానికిదో ఉదహరణ మాత్రమే.

పెండింగ్ లో ఉన్న బిల్లులు

- తెలంగాణ విశ్వవిద్యాలయాల ఉమ్మడి నియామక బోర్డు బిల్లు
- ములుగు అటవీ కళాశాలను యూనివర్సిటీగా మార్చే బిల్లు
- ప్రైవేట్ యూనివర్సిటీస్ బిల్లు
- మోటార్ వాహనాల పన్ను బిల్లు



- వ్యవసాయ విద్యావిద్యాలయాల చట్ట సవరణ బిల్లు
- మున్సిపల్ చట్ట సవరణ
- పబ్లిక్ ఎంప్లాయిమెంట్ చట్ట సవరణ బిల్లు

ఇలా ఒకటి కాదు, రెండు కాదు ఏకంగా పది బిల్లులు ఆగిపోయాయ్, ఆరు నెలలుగా రాజ్‌భవన్ గడప దాటి బయటికి రావడం లేదవి. ఇవన్నీ గవర్నర్ ఆమోదం కోసం ఎదురుచూస్తున్నాయ్. ఎన్నిసార్లు రిమైండ్ చేసినా నెత్తీనోరు బాదుకున్నా అట్నుంచి ఆన్సర్ రాకపోవడంతో మరో దారిలేక సుప్రీం మెట్టెక్కింది కేసీఆర్ సర్కార్. గవర్నర్ కార్యదర్శి, కేంద్ర న్యాయశాఖను ప్రతివాదులుగా చేర్చిన తెలంగాణ ప్రభుత్వం? బిల్లులను ఆమోదించేలా ఆదేశించండంటూ సుప్రీంను కోరింది. ఈ బిల్లులన్నీ గతేడాది సెప్టెంబర్‌లోనే అసెంబ్లీ ఆమోదించింది. గవర్నర్ ముద్ర కోసం రాజ్‌భవన్‌కి పంపింది. కానీ, ఇప్పటివరకూ అతీలేదు గతీ లేదు. అయితే, చట్ట ప్రకారమే నడుచుకుంటున్నా? దీనివెనుక ఎటువంటి దురుద్దేశం లేదనేది గవర్నర్ తమిళిసై వెర్షన్. ఉప్పూనిప్పులా ఉంటోన్న తమిళిసై, కేసీఆర్‌లు బడ్జెట్ సెషన్స్ టైమ్‌లో ఒకే ఫ్రేమ్‌లో కనిపించడం ఇక అంతా ప్రశాంతం, ఆల్ ఈజ్ వెల్ అనుకున్నారు. కానీ లేటెస్ట్ ఎపిసోడ్‌తో అది ఇప్పట్లో తేలే వ్యవహారం కాదని తేలిపోయింది. కేసీఆర్ ప్రభుత్వం మళ్లీ సుప్రీం గడప తొక్కడంతో కథ మొదటికొచ్చినట్టయ్యింది. ఈ ఎపిసోడ్‌తో అంతంతమాత్రంగా ఉన్న సంబంధాలు ఇప్పుడు పూర్తిగా తెగిపోయినట్టే. ఎవరూ పూడ్చలేనంతగా ప్రగతిభవన్, రాజ్‌భవన్ మధ్య అగాధం ఏర్పడినట్టే కనిపిస్తోంది. బిల్లుల ఆమోదం కోసం తెలంగాణ ప్రభుత్వం దాఖలుచేసిన పిటిషన్ ఇవాళ విచారణకు రానుంది. మరి, సుప్రీం ఎలా రియాక్టవుతుందో చూడాలి!.

# రెరా ఛైర్మన్ కోసం ముగ్గురు పోటీ

**హైదరాబాద్ :**

ఆ పదవి మరేదో కాదు.. రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ ? రెరా ఛైర్మన్. ఒక్క ఛైర్మనే కాదు.. రెరాలోని సభ్యుల నియామకం కోసం కూడా దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. ఛైర్మన్ పదవి కోసమైతే రిటైర్డ్ సీనియర్ ఐఏఎస్ అధికారులు క్యూ కట్టారు. సభ్యులుగా తమకు అవకాశం వస్తుందన్న ఆశతో రిటైర్మెంట్‌కు దగ్గర పడ్డవాళ్లు సైతం ఓ కర్చీఫ్ వేస్తున్నారు. రెరా పదవులకు దరఖాస్తులు చేసుకునే గడువు ఫిబ్రవరి 17తోనే ముగిసింది. తాజాగా ఆ గడువును మార్చి 3 వరకు పొడిగించారు. రాష్ట్రంలో 2017 నుంచి అమల్లోకి వచ్చిన రెరా చట్టానికి పూర్తిస్థాయి అథారిటీని నియమించలేదు. ప్రస్తుతం రెరా ఛైర్మన్‌తోపాటు ఇద్దరు పూర్తిస్థాయి డైరెక్టర్ల నియామకానికి ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ప్రస్తుతం ఛైర్మన్ పదవికి మాజీ సీఎస్‌లతోపాటు పలువురు మాజీ ఐఏఎస్ లు పోటీపడుతున్నారు. వారిలో ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్ ప్రభుత్వ సలహాదారు ఎస్‌కె జోషి, మాజీ సిఎస్ సోమేష్‌కుమార్, ప్రస్తుతం ఎంఏయూడి డైరెక్టర్ పనిచేస్తున్న సత్యనారాయణ గట్టి లాబీయింగే చేస్తున్నారట. రెరా చట్టానికి 2016లో ఆమోద ముద్ర పడగా.. జూలై 2017 నుంచి తెలంగాణ ప్రభుత్వం దీనిని అమల్లోకి తీసుకొచ్చింది. తొలుత రెరా ఛైర్మన్‌గా రాజేశ్వర్ తివారీ, సభ్యుడిగా విద్యాధర్‌రావులను ప్రభుత్వం నియమించింది. రాజేశ్వర్ తివారీ రిటైరైన తరువాత సుమారు మూడేళ్లపాటు ఈ పోస్టులో సోమేష్‌కుమార్ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. గత ఏడాది అక్టోబర్ వరకు రెరాలో 19 వేల పైచిలుకు ప్రాజెక్టులు నమోదు కాగా 2 వేల 4వందల 48 ఏజెంట్లు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. స్థిరాస్తి కొనుగోలుదారుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాన్ని.. పలు భవన నిర్మాణ సంస్థలు ఇప్పటికీ బేఖాతర్ చేస్తున్నాయి. స్థిరాస్తి నియంత్రణ అథారిటీ అనుమతి తప్పనిసరైనా పట్టించుకోవడం లేదు. జీహెచ్ఎంసీ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టులు మినహా ఇతరచోట్ల యజమానులు ఆసక్తి కనబర్చడం లేదు. హైదరాబాద్? చుట్టుపక్కలతోపాటు రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పలు జిల్లా కేంద్రాల్లో రెరా అనుమతి లేకుండానే పెద్దసంఖ్యలో అపార్ట్‌మెంట్‌లు, లేఅవుట్లు పుట్టుకొస్తున్నాయి. వరంగల్ నగరపాలక సంస్థ పరిధిలో చేపడుతున్న ప్రాజెక్టుల్లో 10 శాతం కూడా రెరా అనుమతి పొందడం లేదు. కరీంనగర్, నిజామాబాద్ సహా పలు ప్రధాన పట్టణాలు, జిల్లా కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొందని ప్రభుత్వానికి ఫిర్యాదులు అందుతున్నాయి. రెరా అమలులోకి వచ్చాక వేల వెంచర్లు వేసినా ఇప్పటివరకూ నమోదైనవి సుమారు ఐదు వేలు మాత్రమే. అనుమతి లేని ప్రాజెక్టులపై చట్టంలోని సెక్షన్ 59 ప్రకారం చర్యలు తీసుకోవాలి. కొన్ని సందర్భాల్లో మినహా భారీ జరిమానాలు విధించిన దాఖలాలు లేవు. దీంతో చాలామంది బిల్డర్లు, రియల్టర్లు రెరాను పట్టించుకోవడం లేదు. రెరా చట్టాన్ని కఠినంగా అమలు చేసి ప్రజలకు మేలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్టు సమాచారం. ప్రస్తుతం నిబంధనలు అతిక్రమించిన కొన్ని సంస్థలకు నెలరోజులుగా రెరా నోటీసులు ఇస్తుండడంతో అందరూ అలర్ట్ అయ్యారు. కీలక అనుమతులకు ఇచ్చేది రెరానే కావడంతో.. రిటైర్డ్ ఐఏఎస్ లు ఛైర్మన్ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ప్రభుత్వ పెద్దలతో తమకున్న పరిచయాలను దృష్టిలో పెట్టుకుని పావులు కదుపుతున్నారు. ఫలానా మాజీ అధికారికి ఓకే అయినట్టు ప్రచారం జరుగుతున్నా.. స్పష్టత లేదు. ఇటు ఛైర్మన్ లేక.. అనుమతులు లభించక వేల దరఖాస్తులు రెరా ఆఫీసులో పెండింగ్‌లో ఉన్నాయని రియాల్టర్లు గగ్గోలు పెడుతున్నారు. మరి.. పదవుల పందేరంలో ఎవరు రెరా ఛైర్మన్‌గా కొలువు తీరతారో చూడాలి.

# భూపాలపల్లిలో కొనసాగుతున్న ఉద్రిక్తత

**వరంగల్ :**

భూపాలపల్లిలో రాజకీయ వేడి తగ్గడం లేదు. ఇరు పక్షాలు బహిరంగ చర్చపై తగ్గేదేలే అంటున్నాయి. ఈ నేపథ్యంలో.. క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డిని పోలీసులు అడ్డుకున్నారు. అంతేకాకుండా..హన్మకొండలోని స్వగృహంలో సత్యనారాయణ హౌజ్ అరెస్ట్ చేశారు పోలీసులు. చర్చకు సిద్ధమే అంటూ ఇద్దరు నేతల ప్రకటనలు చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర రమణారెడ్డి మాట్లాడుతూ.. ఆరోపణలపై చర్చకు రేవంత్ రెడ్డికి సవాల్ విసిరాను.. 11 గంటలకు అంబేద్కర్ సెంటర్ కు వెళ్తుంటే పోలీసులు అడ్డుకున్నారు. రాజకీయ నేతల మాటలకు ఓ హద్దు ఉండాలని, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే అభిమానులు స్పందిస్తారన్నారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి తన తీరు మార్చుకోవాలని ఆయన అన్నారు. ఇదిలా ఉంటే.. సత్యనారాయణ మాట్లాడుతూ.. బహిరంగ చర్చకు వెళ్లకుండా పోలీసులతో హౌజ్ అరెస్ట్ చేయించారని ఆరోపించారు. ఎమ్మెల్యే అక్రమాలపై అన్ని ఆధారాలతో సిద్ధంగా ఉన్నానని ఆయన వెల్లడించారు. చర్చకు రేవంత్ రెడ్డి అవసరం లేదు నేను సిద్ధంగా ఉన్నానని సత్యనారాయణ వ్యాఖ్యానించారు. మరోవైపు డీఎస్పీ కిషోర్ కుమార్ మాట్లాడుతూ.. వ్యక్తిగత దూషణలతో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారన్నారు. నేతల సవాళ్లు ప్రతిసారి వాళ్ళతో లాండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తే అవకాశం ఉందన్నారు. ఇరువర్గాలను బయటకు రాకుండా కట్టడి చేశాం డీఎస్పీ కిషోర్ కుమార్ వెల్లడించారు.

# అవినీతి కేసులో బీజేపీ ఎమ్మెల్యే కొడుకు

**బెంగళూరు:**

కర్ణాటక బీజేపీ నేత లంచం తీసుకుని అధికారుల చేతికి చిక్కాడు. బీజేపీ ఎమ్మెల్యే మదల్ విరూపాక్షప్ప కొడుకు ప్రశాంత్ మదల్ ఈ లంచం తీసుకున్నట్టు లోకాయుక్త అధికారులు వెల్లడించారు. ఆయన ఇంట్లో రూ.6 కోట్ల నగదుని స్వాధీనం చేసుకున్నారు. మరి కొద్ది రోజుల్లో ఎన్నికలు జరగనున్న సమయంలో బీజేపీకి ఇది పెద్ద షాక్‌లా తగిలింది. లోకాయుక్త అంబుడ్స్‌మెన్‌లు ఆయన ఇంట్లో సోదాలు నిర్వహించి నోట్ల కట్టల్ని జప్తు చేశారు. చన్నగిరి ఎమ్మెల్యే మదల్ విరూపాక్ష కి ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. మైసూర్ శాండిల్ సోప్‌ను తయారు చేసేది ఈ కంపెనీయే. ఆయన కొడుకు ప్రశాంత్ మదల్...బెంగళూరు వాటర్ సప్లై అండ్ సీవేజ్ బోర్డ్ లో చీఫ్ అకౌంటెంట్‌గా పని చేస్తున్నారు. గురువారం (ఫిబ్రవరి 2) కర్ణాటక లోకాయుక్త అధికారులు..ప్రశాంత్‌ను ఖఆఆఉ ఆఫీస్‌లోనే లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రూ.40 లక్షలు తీసుకునే సమయంలో అదుపులోకి తీసుకున్నారు. అదే ఆఫీసులో మూడు సంచుల్లో రూ.1.75 కోట్ల విలువైన నోట్ల కట్టలు కనిపించాయి.

# మద్యం మత్తులో నదిలోకి దిగి గల్లంతు

**విజయవాడ :**

కృష్ణానది ఒడ్డున ఆగి ఉన్న ఓ స్కార్పియో.. దూరంగా నదిలో తేలుతూ కనిపించిన ఓ వ్యక్తి శవం.. వాహనం చుట్టుప్రక్కల చూస్తే.. ముగ్గురు ఆ ప్రదేశానికి వచ్చినట్లుగా, ఏదో మందు పార్టీ జరిగినట్లుగా ఆనవాళ్లు.. అటుగా వెళ్తోన్న స్థానికులు ఈ తతంగాన్ని గమనించి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అసలక్కడ ఏం జరిగింది.? మద్యం మత్తులో నదిలోకి దిగి గల్లంతయ్యారా? ఒకవేళ అదే జరిగితే ఒక డెడ్‌బాడీ మాత్రమే ఎందుకు తేలింది. మిగతా ఇద్దరూ ఉన్నారా.. వాళ్లూ గల్లంతయ్యారా? ఇలాంటి అనేక ప్రశ్నలు ప్రస్తుతం సస్పెన్స్‌గా మారాయి. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకుంది. ఆ వివరాలు ఏంటి.? అక్కడేం జరిగిందో ఇప్పుడు తెలుసుకుందామా.? కృష్ణాజిల్లాలోని చోడవరంలో అనుమానస్పద ఘటన జరిగింది. స్థానిక కృష్ణానది పాయ వద్ద ముగ్గురు వ్యక్తులు గల్లంతయినట్లుగా తెలుస్తోంది. ఘటనాస్థలి వద్ద స్కార్పియో వాహనంతో పాటు నదిలో ఓ వ్యక్తి డెడ్‌బాడీ తేలుతూ కనిపించడంతో అక్కడున్న స్థానికులు వెంటనే ఖాకీలకు సమాచారం అందించారు. కారులో మద్యం బాటిళ్లు, ముగ్గురికి సంబంధించి విడిచిన బట్టలను పోలీసులు గుర్తించారు. వారంతా కూడా గల్లంతయినట్లుగా పోలీసులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతానికి ఓ వ్యక్తి డెడ్‌బాడీ మాత్రమే లభ్యం కావడంతో మిగతా ఇద్దరి జాడ కోసం పోలీసులు, గజ ఈతగాళ్లు గాలిస్తున్నారు. మందుపార్టీ కోసం వచ్చి ముగ్గురూ గల్లంతయ్యారా? లేదంటే ఇంకేదైనా క్రైమా అన్నదానిపై పోలీసుల ఆరా తీస్తున్నారు. అయితే వచ్చిన ముగ్గురు ఎవరు? శవమై తేలిన ఆ వ్యక్తి ఎవరన్నదానిపైనా ఇంకా క్లారిటీ లేదు. కానీ స్కార్పియో నెంబర్ ఆధారంగా ఆ వాహనం మొగలురాజుపురానికి చెందినదిగా గుర్తించారు పోలీసులు. కాగా ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## పేద, మధ్య తరగతి ప్రజల ఉసురు పోసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం


**హైదరాబాద్**

వంట గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ సికింద్రాబాద్ లోని జూబ్లీ బస్ స్టేషన్ ధర్నా జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ ధరలను అదుపు చేయడంలో విఫలమైన మోడీ వెంటనే గద్దె దిగాలి. అంబానీ... ఆదానీలకు దోచి పెట్టేందుకే గ్యాస్ ధరలు పెంచారు. తెలంగాణ లో అధికారంలోకి వస్తామని బీజేపీ నేతలు కలలు కంటున్నారుజ 2024 లో కేంద్రంలో ప్రభుత్వం పతనం ఖాయమని అన్నారు. కంటోన్మెంట్ లోని ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ఆర్మీ హాస్పిటల్ లో అనుమతించలేదు. ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవతో మల్టి స్పెషాలిటీ హాస్పిటల్ మంజూరు అయింది. కంటోన్మెంట్ లో గతంలో 15 రోజులకు ఒకసారి త్రాగునీటి సరఫరా జరిగేది.... నేడు ప్రతినిత్యం సరఫరా జరుగుతుంది. తెలంగాణ లో అమలవుతున్న సంక్షేమ పథకాలను దేశ వ్యాప్తం చేసేందుకే తెరాస పార్టీ భారాస పార్టీ గా మార్పు చెందిందని అన్నారు.

# మంత్రి అమర్‌నాథ్ కు నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ

**విశాఖపట్టణం :**

రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్?నాథ్ కు విశాఖ ఆరో మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కమ్ రైల్వే న్యాయస్థానం(నాన్ బెయిలబుల్ అరెస్ట్ వారెంట్ జారీ చేసింది. రైల్వే స్టేషన్?లోకి అనధికారికంగా ప్రవేశించారని ఐదేళ్ల కిందట అమర్?నాథ్పై కేసు నమోదైంది. 2018లో ప్రత్యేక హోదా, రైల్వే జోన్ డిమాండ్ చేస్తూ స్టేషన్?లోకి అనధికార ప్రవేశం చేశారు. విశాఖ-పలాస ప్యాసింజర్‌రైలును నిలిపేసి రైల్‌రోకో నిర్వహించారు. దీంతో గుడివాడ అమర్తో పాటు పలువురు వైసీపీ నేతలు ఉన్నటు రైల్వే అధికారులు గుర్తించారు. విచారణ?లో



భాగంగా నిందితులు ఫిబ్రవరి 27న న్యాయ స్థానంలో హాజరు అవ్వాలి. కానీ..గుడివాడ అమర్?నాథ్, జాన్ వెస్లీలు కోర్ట్?కి హాజరు కాకపోవడంతో నాన్ బెయిల్ అరెస్ట్ వారంటీజారీ కేసును మార్చి 7వ తేదీకి వాయిదా వేసింది.

# బీఆర్ఎస్ ధర్నా

**మహబూబాబాద్**

జిల్లా మరిపెడ మండల కేంద్రంలో మండల బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ జాతీయ రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా ఎంపీ,బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత పాల్గొని రోడ్డుపై వంటచేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎంపి కవిత మాట్లాడుతూ కేంద్రంలో మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకీ వచ్చినప్పటి నుండి పదమూడు మార్లు గ్యాస్ ధరలను పెంచి ఆర్థికంగా పేదవాడి నడ్డి విరుస్తుందని మండిపడ్డారు. యూపీఏ ప్రభుత్వంలో స్వల్పంగా గ్యాస్ ధరలను పెంచితేనే గగ్గోలు పెట్టిన బీజేపీ మహిళా లీడర్లు నేడు గ్యాస్ ధరలు ఆకాశాన్ని అంటినాగానీ పట్టించుకోకపోవడం దుర్మార్గమని విమర్శించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే లక్షమంది మహిళలతో ఢిల్లీలో ధర్నాకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు,డీఎస్ రవిచంద్ర,మరిపెడ ఎంపీపీ గుగులోత్ అరుణ రాంబాబు,జడ్పీటీసీ శారదా రవీందర్ పాల్గొన్నారు.

# కౌకూర్ లో కాంగ్రెస్ డోర్ టూ డోర్

**అల్వాల్**

అల్వాల్ మండల పరిధిలోని కౌకూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నేత నంది కంటి శ్రీధర్ అధ్యక్షతన కాకుర్ గ్రామంలో డోర్ టు డోర్ కార్యక్రమం చేయడం జరిగింది అందులో భాగంగా తెలంగాణ వచ్చిన తర్వాత తెలంగాణ ప్రజలకు ఎంతో లబ్ధి జరుగుతుందని ఆశించారు కానీ ఫలితం మాత్రం శూన్యం. తెలంగాణ ప్రజలకు తెలంగాణ రాష్ట్రాన్ని ప్రసాదించింది మా కాంగ్రెస్ ప్రభుత్వమే అని తెలంగాణ మీద అభిమానంతోటి మొదటి రెండుసార్లు ఎలక్షన్స్ లో గెలిచిన గాని ఎవరికి ఎలాంటి న్యాయం జరగలేదు కానీ ఇప్పుడు ప్రజలు అందరూ తెలుసుకున్నారు కాంగ్రెస్కి పట్టం కాయడం ఖాయమని ఈసారి తెలంగాణ రాజ్యం మేలుతుందని తెలంగాణలో కాంగ్రెస్ గెలిచిన తర్వాత రైతులకు రుణమాఫీ అలాగే అలాగే 80 గజాలు 100 గజాల స్థలం ఉన్నవారికి ఇల్లు నిర్మాణం కోసం ఐదు లక్షలు మరియు ఆరోగ్యశ్రీ కొరకు ఐదు లక్షలు మేము మా ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్యాస్ కూడా 500 రూపాయలకే ఇస్తామని తెలియజేశారు

# హెలికాప్టర్ లో వెళ్లి.. తమ్ముడి పెళ్లి పత్రికలు పంచి

**హైదరాబాద్**

తమ్ముడి పెళ్లి పత్రికలు పంచేందుకు ఓ అన్న వినూత్నంగా ఆలోచించాడు. ట్రెండ్ సెట్ చేస్తూ లగ్న పత్రికల పంపిణీకి ఏకంగా హెలికాప్టర్ బుక్ చేశాడు. హైదరాబాద్కు చెందిన ఓ వ్యాపారి హెలికాప్టర్లో వెళ్లి ముంబైలో ఉన్న బంధువులకు లగ్న పత్రికలు అందజేశాడు. హైదరాబాద్ ఖైరతాబాద్కు చెందిన వ్యాపారి మధు యాదవ్ దూద్వాలా పేరుతో డైరీ ఫాం నిర్వహిస్తున్నాడు. ఈ నెల 9న అతడి తమ్ముడు చందు యాదవ్ పెళ్లి నిశ్చయం కాగా.. బంధువులకు పెళ్లి పత్రికలు పంపిణీ చేయటం ప్రారంభించాడు. నగరంలోని బంధుమిత్రులందరికీ స్వయంగా వెళ్లి పత్రికలు అందజేశాడు. అయితే మధు యాదవ్కు ముంబైలోనూ బంధువులు ఉన్నారు. వారికి కూడా స్వయంగా వెళ్లి తమ్ముడు పెళ్లి పత్రికలు అందజేయాలనుకున్నాడు. అందుకు వినూత్నంగా ఆలోచించాడు. విమానంలోనో, ట్రైన్లోనో వెళ్లకుండా పెళ్లి పత్రికలు పంచేందుకు ఏకంగా ఓ హెలికాప్టర్నే బుక్ చేశాడు. హెలికాప్టర్లో ముంబైకి వెళ్లి బంధువులకు తమ్ముడి లగ్న పత్రికలు అందజేశాడు. హెలికాప్టర్ బుక్ చేసి తన తమ్ముడిపై ఉన్న ప్రేమను చాటుకున్నాడు మధు యాదవ్. ఇక పెళ్లి పత్రికలే హెలికాప్టర్లో పంపిణీ చేస్తే.. పెళ్లికి ఏ రేంజ్లో ఏర్పాట్లు చేస్తాడోనని అందరూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ సన్మానం




**కోరుట్ల,**

ఇటీవల మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్ జగదీశ్వర్ గౌడ్ ను మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి మర్కేజీ ఇంతేజామియా కమిటీ ఇస్లామియా అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దిన్ పాషా శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మర్కేజీ ఇంతేజామియా కమిటీ నాయకులు మహమ్మద్ షకీల్ ,ఫరూక్ అలీ, మిర్జాబేగ్ సమియోద్దీన్, మహమ్మద్ ఉస్మాన్, మహమ్మద్ ఆసిఫ్ ,మహమ్మద్ అస్లం ,మైనారిటీ నాయకులు పాల్గొన్నారు.

# ఉద్యోగ సంఘాలతో మంత్రి చర్చలు

**విజయవాడ :**

ఒకవైపు అమరావతి జేఏసీ ఆందోళనలకు సిద్ధమవుతుంటే, మరోవైపు ఇతర ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపింది ప్రభుత్వం. ప్రత్యేకించి సచివాలయ ఉద్యోగ సంఘం నేతలతో మంత్రి బొత్స సమావేశమై చర్చించారు. ఉద్యోగ సంఘాల నేతలైన బండి శ్రీనివాసరావు, వెంకట్రామిరెడ్డి, ఇతర నాయకులతో విడివిడిగా మాట్లాడారు బొత్స. మొత్తం 94 ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగా అనేకవాటిపై హామీలు లభించాయ్. ముఖ్యంగా 13వేల మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అంగీకరించిందని చెప్పారు ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి. పదేళ్ల సర్వీస్ దాటిన వాళ్లందరినీ రెగ్యులరైజ్ చేసేందుకు ప్రభుత్వం ఒప్పుకుందన్నారు. అలాగే, పెండింగ్లో ఉన్న రెండు డీఏలను త్వరలో చెల్లిస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఉద్యోగులపై నమోదైన 16వందల కేసులను కూడా మాఫీ చేసేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు ఒప్పుకుందని, వాళ్లకు సర్వీస్ రూల్స్, జాబ్ ఛార్ట్ సిద్ధం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు వెంకట్రామిరెడ్డి. అయితే, ఇది అనధికారిక సమావేశం అంటున్నారు ఏపీ జేఏసీ అమరావతి నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు. తాము సీఎస్కి నోటీస్ ఇవ్వడం వల్లే చర్చలకు పిలిచారని చెప్పుకొచ్చారు. జీతాలు ఎందుకు ఆలస్యంగా ఇస్తున్నారని అడిగామన్న బొప్పరాజు, ఆర్థిక అంశాల్లో రాజీపడే ప్రసక్తే లేదని ప్రభుత్వానికి తెగేసి చెప్పామన్నారు. వెంకట్రామిరెడ్డి వ్యాఖ్యలకు భిన్నంగా మాట్లాడారు బొప్పరాజు. ప్రభుత్వం చెప్పిన ఒక్క హామీ కూడా నెరవేరలేదన్నారు. ఉద్యమ కార్యాచరణ నుంచి వెనక్కి తగ్గేదే లేదంటోన్న బొప్పరాజు, ఈనెల 9నుంచి యథాతథంగా పోరాటంలోకి వెళ్తామని తేల్చిచెప్పారు. అయితే, మళ్లీ ఏడో తేదీన సీఎస్తో మీటింగ్ ఉందంటున్నారు మరో ఉద్యోగ సంఘం నేత బండి శ్రీనివాస్. ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ లభించే అవకాశం ఉందని చెబుతున్నారు.

# పెగాసెస్ ఎక్కడ ఉంది

**న్యూఢిల్లీ :**

రాహుల్ గాంధీ బ్రిటన్ పర్యటనలో ఉన్నారు. కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో స్పీచ్ కూడా ఇచ్చారు. ఈ క్రమంలోనే మరోసారి మోదీ సర్కార్పై విరుచుకు పడ్డారు. ప్రధాని మోదీ పాలనలో భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిపోయిందని విమర్శించారు. ప్రతిపక్ష నేతలందరిపైనా గుట్టుగా నిఘా పెడుతున్నారంటూ పెగాసస్ కేసుని ప్రస్తావించారు. దేశం అన్వయించుకోడానికి వీల్లేని విధానాలు బలవంతంగా రుద్దుతున్నారంటూ మండి పడ్డారు. పెగాసస్ గురించి చెబుతూ తన ఫోన్లోనూ పెగాసస్ వైరస్ ఉందని, ఇదే విషయం అధికారులు చెప్పారని అన్నారు. దీనిపై కేంద్రమంత్రి అనురాగ్ ఠాకూర్ స్పందించారు. రాహుల్పై ఆగ్రహం వ్యక్తం చేశారు. "నిన్నటి ఎన్నికల ఫలితాలు ఎలా వస్తాయో రాహుల్ గాంధీకి ముందే తెలుసు. కాంగ్రెస్ను బీజేపీ క్లీన్ స్వీప్ చేసింది. పెగాసస్ ఆయన ఫోన్లో కాదు. ఆయన మెదడులోనే ఉంది. బహుశా ఇటలీ ప్రధాని జార్జియా మెలోని ఏం చెప్పిందో రాహుల్ విన్నట్టు లేదు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ ప్రధాని మోదీని గౌరవిస్తున్నారని చెప్పారు. తన మొబైల్లో పెగాసస్ ఉందన్న అనుమానం ఉన్నప్పుడు అది ప్రభుత్వానికి ఎందుకు ఇవ్వలేదు. విదేశాల్లోనే ఉన్న స్నేహితులతో చేతులు కలిపి దేశ పరువుని దిగజార్చేలా మాట్లాడుతున్నారు" ఈశాన్య రాష్ట్రాల ఎన్నికల ఫలితాల గురించీ ప్రస్తావించారు అనురాగ్ ఠాకూర్. ప్రజలందరూ ప్రధాని మోదీని అభిమానిస్తున్నారని, అందుకే బీజేపీకి భారీ మెజార్టీ వచ్చిందని తేల్చి చెప్పారు. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ భారత్ సొంతమని అన్నారు. భారత మీడియాను కూడా రాహుల్ గాంధీ కించపరుస్తున్నారని మండి పడ్డారుపెగాసస్ స్పైవేర్పై సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. అది పెగాసస్ మాల్వేర్ అనడానికి ఎలాంటి ఆధారాలు లేవని చాలా స్పష్టంగా చెప్పింది. టెక్నికల్ టీమ్ ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ వివరాలు వెల్లడించింది. అదే సమయంలో కేంద్రం ఈ విచారణలో కమిటీకి సరిగా సహకరించలేదనీ అసహనం వ్యక్తం చేసింది. ఇప్పుడు దీనిపైనే భాజపా, కాంగ్రెస్ మధ్య మాటల యుద్ధం మొదలైంది. కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ ట్విటర్ వేదికగా కేంద్రంపై విమర్శలు చేశారు. "కేంద్రం కమిటీకి సహకరించలేదంటే, ఏదో నిజాన్ని దాస్తున్నట్టే కదా" అని ట్వీట్ చేశారు. ఇది ప్రజాస్వామ్యాన్ని అణిచివేయటమే అంటూ ప్రధాని మోదీ, భాజపాపై మండిపడ్డారు. అటు భాజపా కాంగ్రెస్పై ఎదురు దాడికి దిగుతోంది. కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగా ఈ పని చేస్తోందని, ప్రధాని మోదీ చరిష్మాను దెబ్బ తీయాలని చూస్తోందని విమర్శిస్తోంది. సీనియర్ భాజపా నేత రవి శంకర్ ప్రసాద్...రాహుల్ గాంధీని టార్గెట్ చేశారు. ఆ 5 మొబైల్స్లో ఏ మాల్వేర్ ఉందో తేలిన తరవాత, భాజపా ఈ పని చేసిందో లేదో కచ్చితంగా తెలుస్తుందని..అప్పుడు కాంగ్రెస్ తప్పకుండా క్షమాపణ చెప్పాల్సి వస్తుందని మండిపడ్డారు.

# 13 లక్షల కోట్ల పెట్టుబడులు

**విశాఖపట్టణం:**

ఆంధ్రప్రదేశ్ కు 20 రంగాల పారిశ్రామికవేత్తల నుంచి 13 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయని సీఎం జగన్ ప్రకటించారు. విశాఖలో నిర్వహిస్తున్న పెట్టుబడుల సదస్సులో సీఎం జగన్ ప్రసంగించారు. ఈ సందర్భంగా రూ. 13 లక్షల కోట్ల పెట్టుబడుల గురించి చెప్పారు. ఈ పెట్టుబడుల వల్ల 6 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని సీఎం తెలిపారు. 340 పెట్టుబడుల ప్రతిపాదనలు మా ముందుకు వచ్చాయి.. 20 రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చారని. శుక్రవారం రూ. 8.54 లక్షల కోట్ల ఎంవోయూలు జరుగుతాయని వైఎస్ జగన్ ప్రకటించారు. ప్రస్తుతం ఆరు పోర్టులు.. ఆరు ఎ?యిర్ పోర్టులతో అత్యధిక మానవ వనరుల శక్తి ఏపీ కలిగి ఉన్నదని సీఎం జగన్ పారిశ్రామిక వేత్తల దృష్టికి తీసుకెళ్లారు. దేశంలోనే అత్యధిక జీఎస్డీపీ వృద్ధి ఉన్న రాష్ట్రం ఏపీ అని సీఎం తెలిపారు.

గ్రీన్ ఎనర్జీపై ప్రధానంగా ఫోకస్

దేశ ప్రగతికి ఏపీ కీలకంగా మారిందని గ్రీన్ ఎనర్జీపై ప్రధానంగా ఫోకస్ పెడుతున్నామని సీఎం జగన్ తెలిపారు. పారిశ్రామిక వేత్తల అభిప్రాయాలతో నెంబర్ వన్గా నిలిచామన్నారు. ఏపీలో మూడు పారిశ్రామిక కారిడార్లు ఉన్నాయన్నారు. రాష్ట్రం నుంచి ఎగుమతులు గణనీయంగా పెరగాయని గుర్తు చేశారు. పలు కీలక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకు వస్తామన్నారుభారతదేశానికి ఏపీ ఎంతో ముఖ్యమని రిలయన్స్ అధినేత ముఖేశ్ అంబానీ పేర్కొన్నారు. రాష్ట్రంలో 5జీ నెట్వర్క్ 90శాతం కవర్ చేస్తున్నట్లు తెలిపారు. ఏపీ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుతామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ శరవేగంగా అభివృద్ధి చెందుతోందని గ్రంధి మల్లికార్జున రావు తెలిపారు. ఇందుకు అనేక గణాంకాలు ఉదాహరణగా ఉన్నాయన్నారు. హైదరాబాద్లోని అంతర్జాతీయ విమానాశ్రయం తరహాలో భోగాపురం విమానాశ్రయాన్ని నిర్మిస్తామన్నారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ ద్వారా లక్ష ఉద్యోగాలు అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. సొంత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో పరిశ్రమల స్థాపనకు తరలిరావాలని జీఎంఆర్ సైతం పిలుపునిస్తుందన్నారు. ఆరోగ్య రంగంలో ఏపీ సర్కార్ కృషి అభినందనీయమని అపోలో హాస్పిటల్స్ వైస్ చైర్పర్సన్ ప్రీతారెడ్డి పేర్కొన్నారు. ఏపీ సర్కార్తో అపోలో భాగస్వామిగా ఉండటం సంతోషంగా ఉందన్నారు. ఆరోగ్యశ్రీ పథకం ఆవిష్కర్త వైఎస్సార్ సేవలను ప్రీతారెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేశారు

# వార్డును అన్ని విధాల అభివృద్ధికి కృషి చేస్తా

**కోరుట్ల,**



కోరుట్ల మున్సిపల్ లోని 16వ వార్డును ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కృషితో మున్సిపల్ చైర్ పర్సన్ అన్నం లావణ్య అనిల్ సహకారంతో అన్ని విధాలా అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ 16వ వార్డు కౌన్సిలర్ బలిజ పద్మా- రాజారెడ్డి అన్నారు. శుక్రవారం వార్డులో వార్డు కమిటీల ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు కృషితో వార్డు అన్ని విధాల అభివృద్ధి జరిగిందని, మరికొంత అభివృద్ధి జరగవలసింది ఉందన్నారు. వార్డులో వోల్టేజ్ సమస్య ఉండడంతో నూతన విద్యుత్తు ట్రాన్స్ఫార్మర్ను ఎమ్మెల్యే ఆదేశాలతో విద్యుత్ అధికారులు ఏర్పాటు చేశారన్నారు. మిషన్ భగీరథ పనులు కూడా పూర్తయి తాగునీరు అందుతుందని తెలిపారు. చేయవలసిన పనులను ఎమ్మెల్యే సహకారంతో త్వరలోనే చేపిస్తానని ఆమె అన్నారు. వార్డులో అర్హత కలిగిన వారందరికీ పెన్షన్లు ఇతర సంక్షేమ పథకాలు అందే విధంగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రత్యేక అధికారి పేట అశోక్, ఆర్ పి పావని, వార్డు కమిటీ సభ్యులు పసుల గంగ నరసయ్య, ఉయ్యాల శేఖర్, పసల చిన్నయ్య, గోరువంతుల సత్తయ్య, మైస రాజేష్, బలిజ రాజశేఖర్, గుడిసెల తుక్కమ్మ, సంటి నర్సు, దామభూదేవి, బలిజ ఉమా, బలిజ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

# అనుమానితుల సమాచారం ఇవ్వండి

**జయశంకర్ భూపాలపల్లి**

భూపాలపల్లి జిల్ల మహదేవపూర్ సిఐ కిరణ్ ఆధ్వర్యంలో పలిమెల మండలంలోని బూరుగ్గూడెం లో కార్డన్ నిర్వహించడం జరిగింది. గ్రామంలో తనిఖీలు నిర్వహించిన అనంతరం గ్రామస్తులతో సమావేషం నిర్వహించడం జరిగింది. ఈ సమావేషంలో సిఐ కిరణ్ మరియు ఎస్సై అరుణ్ మాట్లాడుతూ గ్రామంలో అనుమానంగా ఎవరైనా కనబడినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచింఛడం జరిగింది. మావోయిస్టులకు ఏ విధమైనా సహాయం చేయకూడదని హెచ్చరించడం జరిగింది. మావోయిస్టుల మాటలకు ఆకర్షణ చెందకూడదని, వారందరూ చట్ట విద్రోహులని చెప్పడం జరిగింది. యువతను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రభుత్వం అనేక ఉద్యోగాల నోటిఫికేషన్లను వెలువరించినదనీ, అర్హత కలిగిన ఉద్యాగాలకు అప్లై చేసుకోవాలని సూచించడం జరిగింది. యువతకు మంచి భవిష్యత్తు ఉన్నదని చెడు మార్గాలవైపు వెళ్ళరాదని తెలియచెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐ కిరణ్, ఎస్సై అరుణ్ లతో స్పెషల్ పార్టీ సిబ్బంది ఉన్నారు

# ఎస్టీ కమిషన్ చైర్మన్ రవిబాబు కు మర్యాదపూర్వకంగా కలిసిన మండల పార్టీ అధ్యక్షుడు కొర్రా గాసి



**అరకులోయ**

గవర్నర్ కోటాలో శాసనమండలి సభ్యులుగా ఎన్నిక కానున్న ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్ డా.కుంభా రవిబాబుకు వైఎస్సార్ సిపి మండల పార్టీ అధ్యక్షుడు కొర్రా గాసి శుభాకాంక్షలు తెలియజేశారు. అరకులోయ మండల కేంద్రంలో శుక్రవారం పర్యటించిన డా.కుంభా రవిబాబు గారికి మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేస్తూ, దుశ్వాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. చట్టసభల్లో గిరిజనులకు గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యతపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, వైఎస్సార్సీపీ నాయకులు, కార్యకర్తలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# 27 మంది విద్యార్థులకు అస్వస్థత

**సత్యసాయి**

మూంగ్ దాల్ ప్యాకెట్స్ తిన్న 27 మంది విద్యార్థులు కళ్ళు తిరిగి పడిపోయారు. ఈ ఘటన ఎనుముల పల్లిలో కలకలం రేపింది. ఒక ట్రస్టు నిర్వహిస్తున్న స్కూల్ లో మూంగ్ దాల్ (ఎనీనీనిణ టజీశ్రీ) పాకెట్స్ తిని కళ్ళు తిరిగి పడిపోయారు. అయితే టీచర్లు మాత్రం స్కూల్ సమీపంలో పొగ ద్వారా పిల్లలు అనారోగ్యానికి గురయ్యారు అంటున్నారు. కళ్ళు తిరిగి పడిపోయిన విద్యార్థులను ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పోలీసులు, అధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# ఇద్దరు మావోయిస్టుల అరెస్టు

**భద్రాద్రి**

భద్రాతాదళాలకు ఇద్దరు మావోయిస్టులు దొరికిపోయారు. శుక్రవారం నాడు తెలంగాణ- చత్తీస్ ఘడ్ రాష్ట్ర సరిహద్దు గ్రామమైన, పైడిగూడెం గ్రామ సరిహద్దు అటవీ ప్రాంతంలో దుమ్ముగూడెం పోలీస్ సిబ్బంది, కేంద్ర భద్రతాదళాలు సంయుక్తంగా కూంబింగ్ నిర్వహించాయి. ఈ కూంబింగ్ ఆపరేషన్లో నిషేధిత సిపిఐ మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు పామేడు దళం సభ్యులను, ఒక మావోయిస్టు పార్టీ సానుభూతిపరుడిని అరెస్టు చేసారు. మావోయిస్టులు సోడి కామే, (కామారం గ్రామం), సోడి బందు, (కామారం గ్రామం) ఒక మావోయిస్టు పార్టీ సానుభూతిపరుడు సోడి, చంటిలను అదుపులోకి తీసుకున్నారు. వీరంతా మవోయిస్ట్ పార్టీ అగ్రనాయకత్వం ఆదేశాల ప్రకారంగా పోలీసులను చంపాలనే ఉద్దేశ్యంతో ల్యాండ్ మైన్స్ ఏర్పాటు చేయుటకు గాను పైడిగూడెం ఫారెస్ట్ ఏరియాకి వచ్చినట్లు గా అంగీకరించారని పోలీసులు వెల్లడించారు. వీరినుంచి పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నారు.

# ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల**

చెన్నైకి చెందిన రోహిణి ఎంటర్ ప్రైజస్ కంపెనీ ఎస్వీబీసీ ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం అందించారు. ఈ మేరకు విరాళం డిడిని కంపెనీ ప్రతినిధి తిరుపతికి చెందిన రాఘవేంద్ర శుక్రవారం ఉదయం తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈవో ఎవి.ధర్మారెడ్డికి అందజేశారు

ప్రజా తపన
prajathapana.com
News that matters

# క్రైమ్ సెంటర్ గా నిజామాబాద్

**నిజామాబాద్ :**

అబ్దుల్లాపూర్ మెట్ లో ఓ యువతి కోసం స్నేహితుడిని అది కిరాతకంగా చంపిన ఘటన మర్చిపోక ముందే అలాంటిదే మరో ఘటన వెలుగులోకి వచ్చింది. నిజామాబాద్ జిల్లాలోనూ అబ్దుల్లాపూర్ మెట్ తరహా ఘటన ఒకటి జరిగిందని నిర్ధారించారు. అయితే, ఇది దాదాపు ఐదు నెలల క్రితం జరగ్గా, ఇప్పుడు వెలుగులోకి వచ్చింది. అబ్దుల్లాపూర్ మెట్ హత్య ఉదంతం సంచలనం రేపి, రాష్ట్రమంతా తీవ్ర చర్చనీయాంశం అయిన దరిమిలా, నిజామాబాద్ జిల్లాలో జరిగిన పాత హత్య బయటకు వచ్చింది. తాను ప్రేమించిన అమ్మాయిని ఇంకో వ్యక్తి ఇష్టపడుతున్నాడనే కోపంతో స్నేహితుడిని అత్యంత దారుణంగా ఓ యువకుడు హతమార్చాడు. అయిదు నెలల క్రితం నిజామాబాద్ జిల్లా నందిపేట మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. నందిపేట పోలీసులు ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. నందిపేట మండల పరిధిలోని ఆంధ్రానగర్ పంచాయతీ పరిధిలో ఏపీలోని వివిధ జిల్లాల నుంచి వలస వచ్చిన కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. అక్కడే చిన్న వెంకట రమణ కుటుంబం కూడా నివాసం ఉంటోంది. వెంకటరమణ కుమారుడు కార్తీక్(22), అక్కడే ఉండే బాపట్ల రాజు (22) ఇద్దరూ మంచి ఫ్రెండ్స్. ప్రకాశం జిల్లా నుంచి వచ్చి స్థిరపడ్డ ఓ యువతి అప్పుడప్పుడు రాజు ఇంటికి వస్తుండేది. అలా రాజుతో ప్రేమలో పడింది. మరోవైపు, కార్తీక్‌కు కూడా ఆమె తెలుసు. ఇతను కూడా ప్రేమగా మార్చుకున్నాడు. ముందుగా ఆ యువతిని ప్రేమించిన రాజు ఆమెను పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. కానీ తన స్నేహితుడు కార్తీక్ కూడా ఆ అమ్మాయిని ప్రేమిస్తున్నాడని రాజుకు తెలిసింది. ఈ విషయం తెలిసి రాజుకు కార్తీక్‌పై కోపం వచ్చింది. తనకు కాబోయే భార్యను ప్రేమిస్తున్నాడని అతనిపై పగ పెంచుకున్నాడు. ఎలాగైనా తన ప్రేమకు, పెళ్లికి అడ్డుగా వస్తున్న కార్తీక్‌ను అడ్డు తొలగించుకోవాలనుకున్నాడు. ఆ కుట్రలో భాగంగా తన తమ్ముడు హరీశ్‌తో కలిసి కార్తీక్‌ను చంపడానికి కుట్ర పన్నాడు. ప్లాన్ ప్రకారం సెప్టెంబర్ 20, 2022న నందిపేట్ శివారులోని ఎల్లమ్మ గుడి వద్దకు ముగ్గురూ కలిసి వెళ్లి మద్యం సేవించి, కార్తీక్‌కు ఎక్కువ మందు తాగించారు.
అలా మత్తులో ఉన్న కార్తీక్‌ను విజయనగరం గుట్ట దగ్గరికి తీసుకువెళ్లి తలపై కర్రతో తీవ్రంగా కొట్టారు. కార్తీక్ అక్కడికక్కడే చనిపోయాడు. తర్వాత విజయనగరం గుట్ట ప్రాంతంలో రాళ్ల మధ్య కార్తీక్ మృతదేహాన్ని పడేసి వెళ్లిపోయారు. ఆ తర్వాత కొద్దిరోజులకు ఆ యువతిని రాజు పెళ్లి చేసుకున్నాడు. కార్తీక్ కనిపించకపోవడంతో అతడి కుటుంబం బతుకుదెరువు కోసం ఏపీకి వెళ్లి ఉంటాడని భావించింది. అబ్దుల్లాపూర్ మెట్ ఘటన వెలుగులోకి వచ్చాక, అలాంటి ఘటనే తమ ఊళ్లోనూ జరిగిందని గ్రామంలో అందరూ మాట్లాడుకుంటుండగా ఆ మాట వెంకటరమణను చేరింది. కార్తీక్‌ను చంపేసి ఉంటారని అనుమానం కలిగింది. కార్తీక్ కుటుంబం పోలీసులకు సమాచారం అందించగా.. గుట్ట ప్రాంతంలో పరిశీలించగా ఓ అస్థి పంజరం కనిపించింది. ఆ అస్థిపంజరానికి పోస్టు మార్టం నిర్వహించగా, పోస్టుమార్టం నివేదికలో ఆ అస్థిపంజరం కార్తీక్‌దే అని నిర్ధారణ అయింది. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేయగా రాజు, హరీశ్ ఈ పని చేసినట్లుగా తేలింది. పోలీసులు తమ గురించి వెతుకుతున్నారని గ్రహించిన నిందితులు రాజు, హరీశ్ పారిపోయారు. వీలైనంత త్వరగా వారిని పట్టుకుంటామని పోలీసులు చెప్పారు.

# దారి మళ్లుతున్న యూరియా

**కరీంనగర్ :**

జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు గత నెల 20న అలాట్మెంట్ చేసిన యూరియా పంపిణీలో అవకతవకలు జరిగాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు 450 మెట్రిక్ టన్నుల యూరియా అలాట్ మెంట్ జరిగింది. కాటారం మండలంలోని దేవరరామ్ పల్లిలోని రాజరాజేశ్వర ఫర్టిలైజర్స్ కు 49.5 టన్నులు, గారేపల్లిలోని క్రాంతికుమార్ ట్రేడర్స్ కు 99 టన్నులు, లావణ్య ఫర్టిలైజర్స్ కు 39.6 టన్నులు, బచ్చు ప్రభాకర్ ఫర్టిలైజర్స్ కు 39.6 టన్నులు, కాళేశ్వరం తిరుమల ఫర్టిలైజర్స్ కు 29.7 టన్నులు, కొయ్యూరులోని జై హనుమాన్ ఫర్టిలైజర్స్ కు 59.4 టన్నులు, బొమ్మపూర్ లోని సాగర్ ఫర్టిలైజర్స్ కు 29.7 టన్నులు, తాటిచెర్లలోని తిరుమల ట్రేడర్స్ 14.850 టన్నులు, జయశంకర్ లో శ్రీలక్ష్మి ట్రేడింగ్ పేరుతో 39.600 టన్నులు, టీఎస్ ఆగ్రోస్ కు 49.5 టన్నులు నాగార్జున కంపెనీ అలాట్మెంట్ చేశారు. క్షేత్రస్థాయిలో కొన్ని దుకాణాలకు యూరియా పూర్తిగా పంపిణీ చేయలేదు. దుకాణాల పేరుతో ఎన్ఓసీలు వ్రాసి, యూరియాను కొన్ని దుకాణాల పేరిట ఇతర జిల్లాలకు కంపెనీ రిప్రెజెంటేటివ్ విక్రయించినట్లు తెలుస్తోంది. ఎన్ని రోజులుగా ఈ తతంగం జరుగుతుందో తెలియదు గానీ ఈసారి గుట్టు రట్టయింది. గత ఆరు నెలలలో నాగార్జున కంపెనీకి చెందిన యూరియా 220,450 టన్నులు రెండు విడతలుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు యూరియా అలాట్మెంట్ కేటాయించారు. గత నెల 20న జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు కేటాయించిన 450 మెట్రిక్ టన్నులలో సుమారు 200 టన్నుల యూరియా ఇతర జిల్లాలకు దారి మళ్లించినట్లు అర్థమవుతుంది. హోల్ సేల్ గా ఎరువులు విక్రయించేందుకు జిల్లా లైసెన్స్ లేనప్పటికీ బిల్లులు పెట్టినట్లు సమాచారం. ఆశ్చర్యమైన విషయం ఏమిటంటే దుకాణాల పేరిట అలాట్మెంట్ ఇస్తూ కంపెనీ సేల్స్ ఆఫీసర్ ఈ యూరియాను దారి మళ్లించినట్లు సమాచారం. ఈ విషయమై క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు విచారణ చేసి ఎన్ని టన్నుల యూరియా స్టాక్ వచ్చింది.. మిగతాది ఏం జరిగిందనే విషయమై దుకాణదారుల నుండి దరఖాస్తులను తీసుకుని వెళ్లారు. మహాదేవపూర్, మలహర్ మండలాల్లో వచ్చిన యూరియాను వ్యాపారస్తులు విక్రయిస్తున్నారు. కాటారం మండలంనకు వచ్చిన యూరియాపై వ్యవసాయ అధికారులు దుకాణాల వారీగా తనిఖీలు చేశారు. స్టాకున్నా యూరియాను విక్రయించకుండా నిలుపుదల చేస్తూ నోటీసులు ఇచ్చారు. దుకాణాలకు స్టాక్ రాకుండా పక్కదారి మళ్లిన విషయమై ఎలాంటి చర్యలు తీసుకోకుండా దుకాణాల్లో ఉన్న స్టాకును విక్రయించకుండా వ్యవసాయ అధికారులు తీసుకున్న చర్యలపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

# ఆన్ లైన్ లో భద్రాద్రి రామయ్య కళ్యాణం

**ఖమ్మం :**

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మార్చి 22 నుంచి ఏప్రిల్ 5 వరకు శ్రీరామ నవమి కల్యాణ బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఏడాది ఆన్‌లైన్‌లో సైతం భక్తులు కళ్యాణోత్సవాలను వీక్షించేందుకు వీలుగా ఏర్పాట్లు చేస్తున్నారు. మార్చి 30న ఆలయ సమీపంలోని దేవస్థానం మిథిలా మండపంలో నిర్వహించే కల్యాణాన్ని భక్తులు ప్రత్యక్షంగా వీక్షించేందుకు వీలుగా ఏర్పాటు చేస్తున్నారు. ఇందుకు సంబంధించిన టికెట్లను మార్చి1 బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచుతున్నట్లు రామాలయం ఈవో రమాదేవి తెలిపారు. రూ.7,500, రూ.2,500, రూ.2 వేలు, రూ.1000, రూ.300, రూ.150 టికెట్లు ఉంటాయని ఈవో వివరించారు. రూ.7,500 టికెట్‌పై ఇద్దరికి ప్రవేశం కల్పించి స్వామివారి ప్రసాదం అందజేస్తారు. మిగతా వాటిలో ఒక టికెట్‌పై ఒకరికే అవకాశం కల్పిస్తారు. మొత్తంగా 16,860 మంది టికెట్లతో మండపంలోను, 15 వేల మంది స్టేడియం నుంచి ఉచితంగా కల్యాణాన్ని ప్రత్యక్షంగా వీక్షించవచ్చు. రూ.7,500 టికెట్లను ఆన్‌లైన్‌తో పాటు ఆలయ కార్యాలయంలోనూ బుధవారం నుంచి విక్రయించనున్నారు. మార్చి 31న నిర్వహించే శ్రీరామ సామ్రాజ్య పట్టాభిషేకానికి సంబంధించి ఈసారి 3 రకాల ధరలతో టికెట్లను విక్రయించనున్నారు. వీటినీ బుధవారం నుంచి ఆన్‌లైన్‌లో కొనుగోలు చేయవచ్చుభారతావనిలో పౌరాణికంగా, చారిత్రకంగాను అతి ప్రసిద్ధమైన దివ్య క్షేత్రం భద్రాచల శ్రీరామ క్షేత్రం ఒకటి. త్రేతాయుగమున దండకారణ్యములోని పర్ణశాల ప్రాంతములో వనవాసము చేయుచున్న సీతారాములకు ఒకనాటి విహార సమయమున విశ్రాంతి స్థానమైన ఒక శిల ఆ దివ్య దంపతులకు ఆనందాన్ని కలిగించి వారి అనుగ్రహానికి పాత్రమైందని చెబుతారు. ఆ శిలనే బ్రహ్మదేవుని వరప్రసాదముగా మేరుదేవి మేరు పర్వతరాజ దంపతులకు భద్రుడు అను పేరిట పుత్రుడై జన్మించినట్లు పురాణాల్లో వివరించారు. బాల్యం నుండి శ్రీరామభక్తుడైన భద్రుడు నారద మహర్షి ద్వారా శ్రీరామ తారక మంత్రమును ఉపదేశంగా పొంది, శ్రీరామ సాక్షాత్కారమునకై దండకారణ్యములో ఘోర తపస్సు నాచరించాడు. ఆ తపఃప్రభావముతో శ్రీమన్నారాయణుడు మరల శ్రీరామ రూపమును దాల్చి చతుర్భుజ రామునిగా శంఖ చక్ర ధనుర్బాణములను ధరించి, వామాంకమున (ఎడమ తొడపై) సీతతో, వామ పార్శ్వమున (ఎడమప్రక్కన) లక్ష్మణునితో కూడి పద్మాసనమున ఆసీనుడై ప్రత్యక్షమయ్యారని పురాణాల్లో పేర్కొన్నారు. ఆ తర్వాత భద్రమహర్షి కోరికపై పర్వతరూపంగా మారిన అతని శిఖరాగ్రముపై శ్రీ పాదముద్రలనుంచి పవిత్ర గోదావరి నదికి అభిముఖముగా ఆ భద్రుని హృదయ స్థానమున వెలిశాయని, భద్రుడు అచలమై (కొండ) నందున ఈ క్షేత్రానికి భద్రాచలం అని పేరు వచ్చిందంటారు. స్వామికి భద్రాద్రిరాముడు అని, వైకుంఠము నుండి సాక్షాత్తుగా అవతరించుట చేత వైకుంఠరాముడు అని, ఇక్కడి సీతారామ లక్ష్మణుల దివ్యమూర్తులు అ కార ఉ కార మ కార స్వరూపములు అయినందున ఓంకారరాముడు అని, శంఖ చక్ర ధనుర్బాణములు ధరించుటచే రామనారాయణుడు అని కూడా పేర్లు కూడా ఉన్నాయి.

# వైరాలో వినూత్న నిరసన

**వైరా**

గత 8 సంవత్సరాలుగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పాలనలో దేశంలోని మధ్య తరగతి, నిరుపేద ప్రజలు ఆర్థికంగా బలైపోతున్నారని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరను పెంచటాన్ని నిరసిస్తూ వైరాలో బీఆర్ఎస్, సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే రాములు నాయక్ స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బీఆర్ఎస్ శ్రేణులతో మధిర క్రాస్ రోడ్ వరకు ర్యాలీ నిర్వహించారు. గిరిజన మహిళలు తమ సాంప్రదాయ దుస్తులతో ర్యాలీలో పాల్గొని వంట గ్యాస్ సిలిండర్లను తలపై ఎత్తుకుని నిరసన తెలిపారు. అనంతరం మధిర క్రాస్ రోడ్ లో కట్టెల పొయ్యిపై వంటావార్పు నిర్వహించి కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వైరా ఎమ్మెల్యే మాట్లాడుతూ మోడీ పాలనలో దేశవ్యాప్తంగా ప్రజాస్వామ్యం కూలి అవుతుందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశాన్ని దోచిపెడుతుందని ఆరోపించారు. గడిచిన 8 ఏళ్లలో కేంద్ర ప్రభుత్వం మూడు రెట్లు గ్యాస్ ధరలు పెంచి మధ్యతరగతి, నిరుపేద ప్రజలపై తీవ్ర భారం మోపిందన్నారు. కమర్షియల్ గ్యాస్ బండల ధరలు కూడా పెంచడంతో ప్రజలపై పరోక్షంగా భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆడంబరాల కోసం ప్రధానమంత్రి మోడీ ధరించే దుస్తులకే కోట్లాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. మోడీ పాలనలో అంబానీ అదానీలు మాత్రమే కుబేరులయ్యారని చెప్పారు. నిరుపేదలకు మోడీ పాలనలో లబ్ధి జరగకపోగా వారి నడ్డి విరిచేలా నిత్యవసర వస్తువులతో ధరలు పెంపుదలతోపాటు పన్నుల భారాన్ని మోపారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. 2014 సంవత్సరం ముందు గ్యాస్ నిత్యవసర ధరలు పెరిగిన సమయంలో రోడ్డెక్కి ఆందోళన చేసిన స్మృతి ఇరానీ లాంటివాళ్ళు ప్రస్తుతం ఎందుకు ఆందోళన చేయడం లేదని ప్రశ్నించారు. అప్పట్లో అధికారం కోసం బీజేపీ నాయకులు ప్రజలపై సవతి తల్లి ప్రేమను చూపి దేశ ప్రజలందరినీ మోసం చేశారన్నారు. అధికారం లేనప్పుడు ఒక విధంగా, అధికారం వచ్చాక మరో విధంగా వ్యవహరించడం బీజేపీకే సాధ్యమన్నారు. దేశంలో మతోన్మాద శక్తులను రెచ్చగొడుతూ బీజేపీ పార్టీ రాజకీయ లబ్ధి పొందుతుందని విమర్శించారు. కుల మతాలకు అతీతంగా ఐక్యంగా ఉండే దేశ ప్రజల మధ్య మత చిచ్చుపెట్టి ఆ మంటలతో బీజేపీ రాజకీయ లబ్ధి కోసం చలి కాగుతుందని ధ్వజమెత్తారు. పెంచిన గ్యాస్ ధరలు తగ్గించేంత వరకు బీఆర్ఎస్ తోపాటు వామపక్షాలు ఐక్యంగా ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు బొంతు రాంబాబు, సీపీఐ నాయకులు మిట్టపల్లి రాఘవరావు, వైరా ఎంపీపీ వేల్పుల పావని, జడ్పీటీసీ నంబూరి కనకదుర్గ, వైరా మున్సిపాలిటీ వైస్ చైర్మన్ ముల్లపాటి సీతారాములు, మార్కెట్ కమిటీ చైర్మన్ బీడీకే రత్నం, బీఆర్ఎస్ మండల పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వరరావు, మద్దెల రవి, విశాఖ కమిటీ సభ్యులు కట్టా కృష్ణార్జునరావు, వనమా విశ్వేశ్వరరావు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## బెయిన్ డెడ్ అయిన వారి గుండెను దానం చేయడానికి కుటుంబసభ్యులు ముందుకు రావాలి

## డయల్ యువర్ ఈవోలో టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి

**తిరుమల :**

శ్రీ పద్మావతి చిన్న పిల్లల గుండె ఆసుపత్రిలో నెల రోజుల్లోనే రెండు గుండెమార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా నిర్వహించామని టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి తెలిపారు. బ్రెయిన్ డెడ్ అయిన వారి గుండెను దానం చేయడానికి వారి కుటుంబ సభ్యులు ముందుకురావాలని ఆయన పిలుపు నిచ్చారు. గుండె దానం చేయాలనుకునే వారు ముందుగా టీటీడీ కి తెలియజేస్తే వైద్యబృందం సకాలంలో వచ్చి గుండె సేకరించి దాన్ని మరో బాలుడు లేదా బాలికకు అమర్చి వారి ప్రాణాలు కాపాడటం జరుగుతుందన్నారు.
తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో భక్తులను ఉద్దేశించి, ఆ తరువాత మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. తిరుమలలో. గదుల కేటాయింపు, డిపాజిట్ తిరిగి చెల్లింపు ప్రక్రియలో మార్చి 1 నుండి ప్రయోగాత్మకంగా ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ వినియోగిస్తున్నాము. దీనివల్ల దళారీల బెడద దాదాపుగా తొలగింది. సర్వదర్శనం భక్తులకు వైకుంఠం రెండో క్యూ కాంప్లెక్స్ లో కూడా ఈ పరిజ్ఞానం ఉపయోగిస్తాము. దీనివల్ల ఉచిత లడ్డూల పంపిణీలో అవకతవకలు జరక్కుండా నిరోధించవచ్చు. తిరుమలలోని గోకులం కార్యాలయంలో శ్రీవాణి ఆఫ్‌లైన్ దర్శన టికెట్ల జారీని తిరిగి ప్రారంభించడం జరిగింది. భక్తులు నేరుగా తమ ఆధార్ కార్డుతో హాజరైతేనే టికెట్లు జారీ చేస్తారు. దీనివల్ల దళారుల బెడద పూర్తిగా తొలగుతుంది. తిరుమలలోని శ్రీ వేంకటేశ్వర ప్రాథమిక, ఉన్నత పాఠశాల దేశంలోనే అత్యంత ప్రసిద్ధి చెందిన శ్రీమతి సులోచనాదేవి సింఘానియా స్కూల్ ట్రస్ట్‌తో అవగాహన ఒప్పందం(ఎంఓయు) కుదుర్చుకుంది. దీనివల్ల పాఠశాల సమగ్ర అభివృద్ధి జరుగుతుంది. విద్యార్థులకు మరింత నాణ్యమైన విద్య అందుతుంది. తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు పాదరక్షలు భద్రపరుచుకునేందుకు వీలుగా ఏప్రిల్ రెండవ వారంలో 11 కౌంటర్లు ఏర్పాటు చేస్తాం. పశ్చిమగోదావరి జిల్లా కొవ్వూరులోని ఆంధ్ర గీర్వాణ కళాశాల ప్రాంగణంలో ఫిబ్రవరి 28న శ్రీనివాస రుక్ సంహిత చతుర్వేద హవనం ప్రారంభమైంది. మార్చి ఆరో తేదీ వరకు ఏడు రోజులపాటు ఈ కార్యక్రమం జరగనుంది. శ్రీవారి సాలకట్ల తెప్పోత్సవాలు శుక్రవారం సాయంత్రం ప్రారంభం కానున్నాయి. మార్చి 7వ తేదీ వరకు జరగనున్నాయి. మార్చి 7న కుమారధార తీర్థ ముక్కోటి నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశాము. మార్చి 18న తిరుమలలో శ్రీ అన్నమాచార్య వర్ధంతి ఘనంగా నిర్వహిస్తాము. మార్చి 22న శ్రీ శోభకృత్ నామ ఉగాది సందర్భంగా శ్రీవారి ఆలయంలో ఉగాది ఆస్థానం జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. తిరుమల శ్రీవారి ఆలయంలో మార్చి 30న శ్రీరామనవమి ఆస్థానం, 31న శ్రీరామ పట్టాభిషేకం ఆస్థానం నిర్వహిస్తారు. మార్చి 31 నుండి ఏప్రిల్ 8వ తేదీ వరకు వై ఎస్ ఆర్ జిల్లా ఒంటిమిట్ట శ్రీకోదండరామ స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఏప్రిల్ 5న శ్రీ సీతారాముల కల్యాణం జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి శ్రీ వై ఎస్ జగన్మోహన్ రెడ్డి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారు. శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం వైద్యులు నెల రోజుల వ్యవధిలో రెండవ గుండె మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించి అరుదైన రికార్డు సృష్టించారు. ఆసుపత్రి ప్రారంభించిన 15 నెలల్లోనే 1150 మంది చిన్నారులకు గుండె శస్త్రచికిత్సలు నిర్వహించడం జరిగింది. క్యాన్సర్, కిడ్నీ, గుండె తదితర వ్యాధుల కారణంగా భరించలేని నొప్పితో బాధపడుతున్న రోగులకు ఉపశమనం కల్పించడం కోసం ఫిబ్రవరి 4వ తేదీ నుండి స్విమ్స్‌లో పెయిన్ పాలేటివ్ కేర్ సెంటర్ ప్రారంభించాం. ఇక్కడ నిర్వహిస్తున్న ఓపిడి, ఐపిడిలకు రోగుల నుండి పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. స్విమ్స్‌లో వైద్యసేవలు పొందుతున్న క్యాన్సర్ రోగులకు వైద్య సలహాలు, సూచనలు ఇవ్వడంతోపాటు ఎప్పటికప్పుడు చికిత్సకు సంబంధించిన విషయాలు తెలియజేయడం కోసం క్యాన్సర్ కేర్ ట్రాకర్ యాప్‌ను ప్రారంభించాం. దేశంలో ఈ తరహా యాప్‌ను మొట్టమొదటగా స్విమ్స్‌లోనే ప్రారంభించడం జరిగింది. పుట్టుకతోనే చెవుడు మూగతో బాధపడేవారికి బర్డ్‌లో స్మైల్ ట్రైన్ సంస్థ సహకారంతో ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేస్తున్నాం. రూ.20 లక్షల వ్యయమయ్యే ఈ ఆపరేషన్ ఉచితంగా నిర్వహించి చెవుడు మూగ సమస్యల నుంచి వారికి విముక్తి కల్పించి కొత్త జీవితాన్ని అందిస్తున్నాం. బర్డ్ ఆసుపత్రిలో ఏ వయసువారికైనా ఉచితంగా గ్రహణమొర్రి ఆపరేషన్లు నిర్వహించి వారు స్పష్టంగా మాట్లాడగలిగేలా తయారు చేస్తున్నాం. 5 నెలల కాలంలో 50 ఆపరేషన్లు నిర్వహించాం. రూ.2 లక్షలు ఖర్చు అయ్యే ఈ ఆపరేషన్‌ను ఉచితంగా చేయడంతోపాటు వారికి రవాణా ఖర్చులు, పోషకాహారం తీసుకునేందుకు సహాయం చేస్తున్నాం. అలాగే బర్డ్‌లో అధునాతన సిటి స్కాన్ ఏర్పాటుచేసి బయటి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న రోగులకు కూడా తక్కువ ధరకు సిటి స్కాన్ చేస్తున్నాం. టీటీడీ ఆయుర్వేద ఫార్మశీని మరింత బలోపేతం చేసి ఔషధాల ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతున్నాం. 314 రకాల ఫార్ములాలకు ఆయుష్ శాఖ నుండి అనుమతి లభించింది. వీటిలో 60 రకాల మందులు మొదటి దశలో ఉత్పత్తి చేసి రోగులకు అందుబాటులో ఉంచుతాం. తతిరుమలలో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్న ప్రసాద కేంద్రం పై రాధామోహన్ దాస్ అనే భక్తుడు దురుద్దేశ పూర్వకంగా సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో ప్రచారాన్ని ఈవో ఖండించారు. ఇందుకు సంబంధించి పలువురు భక్తులు అన్నప్రసాదం చాలా బాగా ఉందని వెల్లడించిన వీడియో ను ప్రదర్శించారు. అన్నప్రసాద కేంద్రంలో ఉపయోగించే బియ్యంఇతర సరుకులు కూరగాయలు వివిధ దశల్లో క్షుణ్ణంగా పరీక్షించిన తరువాతే వంటకు ఉపయోగిస్తున్నామని ఈవో వివరించారు. టీటీడీ మీద రాధామోహన్ దాస్ చేసిన దుష్ప్రచారాన్ని భక్తులు నమ్మవద్దని ఈవో విజ్ఞప్తి చేశారు.

## మతసామరస్యానికి ప్రతీక దస్తగిరి స్వామి ఉరుసు

**చాగలమర్రి**

మండలంలోని పెద్ద వంగలి గ్రామంలో వెలసిన ప్రసిద్ధ శ్రీ హజరత్ దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవాలను కులమతాలకు అతీతంగా ప్రజలందరూ ఎంతో ఐక్యమత్యంతో, భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం పూర్వం నుండి ఆనవాయితీగా వస్తుంది. అందుకే ఈ ఉరుసు వేడుకలు మతస్వామ్రస్యానికి ప్రతీక అని చెప్పవచ్చు . నంద్యాల, కర్నూలు , కడప, జిల్లాల నుండే కాక రాష్ట్రంలోని నలుమూలల నుండి భక్తులు ఉరుసు ఉత్సవాలకు హాజరై స్వామికి తమ మృక్కుబడులను తీర్చుకొని భక్తులు వెళుతుంటారు. అందుకే దస్తగిరి స్వామి భక్తుల కొంగుబంగారంగా అభివర్ణిస్తుంటారు. పెద్ద వంగలి దస్తగిరి స్వామి ఉరుసు ఉత్సవాలను ప్రజల సహాయ సహకారాలతో ఏడాది కూడా ఎంతో వైభవంగా జరుగుతున్నట్లు స్వామి కమిటీ అధ్యక్షులు ముల్లా లాలూ సాహెబ్ బుధవారం తెలిపారు . ఈనెల 5వ తేదీన ఆదివారం గంధం 6వ తేదీన సోమవారం



ఉరుసు వేడుకలు పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. ఉరుసు సందర్భంగా భక్తుల సహాయ సహకారాలతో ఈనెల 3తేదీ నుండే ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 7వ తేదీ ఉదయం వరకు అన్నదాన కార్యక్రమం కొనసాగుతున్నదని ఆయన వివరించారు. ప్రతి ఏడాది అన్నదాన సత్రంలో దస్తగిరి స్వామి ఉరుసు సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు . ఉరుసు ఉత్సవాలు ప్రశాంతంగా జరుగుటకై ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.








Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950